APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com



అసెంబ్లీ ఆవరణలో ఆషాఢబోనాలు

2 లో..



శ్రీధర్ బాబుతో ఫ్రాన్స్ కాన్సూల్ జనరల్ భేటీ

2 లో..

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | బుధవారం | 16- 07- 2025 | సంపుటి : 15 | సంచిక : 335 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి

## మబ్బులు దాటి..

- ముగిసిన శుభాంశు శుక్లా రోదసీయాత్ర
- క్షేమంగా భూమ్మీదకు చేరుకున్న భారత వ్యోమగామి
- ప్రధాని మోడీ తదితరుల శుభాకాంక్షలు

నీలగిరివార్త - ఇంటర్‌నెట్ డెస్క్:

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసీయాత్ర ముసిగింది. ఆయన తిరగి క్షేమంగా భూమ్మీదకు చేరుకున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం ఐఎస్ఎస్‌కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తిరిగి భూమిపైకి చేరుకున్నారు. అంతరిక్షంలో ఆయన 18 రోజులు గడిపారు. మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్స్‌లో కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాలలో మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు సురక్షితంగా దిగారు. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్


మిగతా 2వ పేజీలో..



# ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ షాక్!

## బనకచర్లపై చర్చకు నో!

- ఏపీ ఇచ్చిన బనకచర్ల ఎజెండాపై అభ్యంతరం
- తాము పంపిన అజెండాపై చర్చలకు సిద్ధమని ప్రకటన
- కేంద్రానికి ఘాటుగా లేఖ రాసిన తెలంగాణ సర్కార్
- రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చించే అవసరం లేదనిస్పష్టం



ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :

కేంద్రానికి ఘాటుగా లేఖ రాసిన తెలంగాణ సర్కార్ బనకచర్లపై జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ అభ్యంతరాలు చెప్పిన దానిపై చర్చలేమిటని సూటిగా ప్రశ్న తాము పంపిన అజెండాపై చర్చలకు సిద్ధమని ప్రకటన హైదరాబాద్ ఏపీ ప్రభుత్వానికి తెలంగాణ సర్కార్ షాక్ ఇచ్చింది. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు ససేమిరా అంటూ కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. బనకచర్లపై జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ అభ్యంతరాలు తెలిపాయని పేర్కొంది. ఇప్పటి వరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని తెలంగాణ సర్కార్ లేఖలో ప్రస్తావించింది. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీలో కేంద్ర మంత్రి సమక్షంలో బుధవారం జరిగే తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..



## పాలమూరు, రంగారెడ్డి, డిండి ప్రాజెక్ట్‌లకు క్లియిరెన్స్‌లు ఇవ్వండి

- కేంద్రానికి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ లేఖ
- కృష్ణా, గోదావరి బేసిన్ సమస్యలు పరిష్కరించాలని వినతి
- శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఏపీ అక్రమంగా నీటిని మళ్లిస్తోంది
- శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ప్రమాదకరంగా మారిందని ఆందోళన

2 లో..





## గవర్నర్ బంగ్లాలో బీసీ వర్గాల భవితవ్యం

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు
- గవర్నర్ వద్దకు చేరిన ఆర్డినెన్స్ ముసాయిదా

2 లో..

తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా రాజ్‌భవన్‌కు చేరింది.ఇటీవలే కేబినేట్ ఆమోదించిన రిజర్వేషన్ బిల్లుకు ఆర్డినెన్స్ తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

- 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్- నీలగిరివార్త :

ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగామని సీఎం అన్నారు. శామీర్‌పేట జీనోమ్‌వ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్‌కు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్, బల్క్ డ్రగ్స్‌లో 43శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని సీఎం రేవంత రెడ్డి ఉద్ఘాటించారు.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటాసిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను

మిగతా 2వ పేజీలో..



## మలక్‌పేటలో కాల్పుల కలకలం

- సీపీఐ నేత చందునాయక్ హత్య
- హత్యకు ముందు మంగళవారం ఉదయం ఇంటి వద్ద రెక్కీ!
- సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ బృందం సంఘటన స్థలానికి!
- క్లూస్ టీమ్ ద్వారాఆధారాలు లభ్యం
- త్వరలోనే అరెస్టు చేస్తామన్న డీసీపీ

2 లో..



## తెలంగాణకు అన్యాయం జరగదు

- బనకచర్లపై వాదనలు గట్టిగా వినిపించాలి
- కేంద్ర హోంమంత్రి బండి సంజయ్

2 లో..



## డిప్యూటీ సీఎం భట్టికి లీగల్ నోటీసులు

2 లో..

- రోహిత్ వేముల ఆత్మహత్యపై అనుచిత వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న టీబీజేపీ చీఫ్ రామచంద్రరావు

## ఇంకో ఇంజనీర్ ఇన్ చీఫ్!

- విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావు అరెస్ట్
- కాళేశ్వరం కుంభకోణంలో మరో వికెట్
- ఎసిబి సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తింపు



హైదరాబాద్- నీలగిరివార్త :

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావును ఎసిబి అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్‌లో మురళీధర రావు నివాసంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం ఆయనను ఎసిబి అధికారులు అరెస్ట్ చేసినట్టు సమాచారం. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాలలో పది చోట్ల ఎసిబి

మిగతా 2వ పేజీలో..

## కేసీఆర్ హయాంలో 6.47లక్షల రేషన్ కార్డులు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి
- నా వాదన తప్పని నిరూపిస్తే నేను చెంప దెబ్బలు తింటా!
- కాంగ్రెస్ నేతలు కూడా చెంప దెబ్బలు తినడానికి సిద్ధమా?



ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :

కేసీఆర్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులను పంపిణీ చేశామని నా వాదన తప్పని నిరూపిస్తే నేను చెంపదెబ్బలు తింటానని నిజమైతే కాంగ్రెస్ నేతలు చెంప దెబ్బలకు సిద్ధమా? అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని నిస్సిగ్గుగా అబద్దాలు చెప్పడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారని జగదీష్‌రెడ్డి విమర్శించారు. జూలై 2021లో ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంచినట్టు అప్పట్లో ట్వీట్ చేశారని జగదీష్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాజీఎంపీగా బీఆర్ఎస్ లో ఉన్నపుడు రేషన్ కార్డుల పంపిణీ గురించి ప్రత్రికల్లో ప్రకటనలు ఇచ్చారన్నారు. చౌటుప్పలలో అప్పటి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో నేను

మిగతా 2వ పేజీలో..

## కేరళ నర్స్ నిమిషకు భారీ ఊరట

- యెమెన్‌తో కేంద్రం చర్చలు ఫలవంతం
- ఉరి అమలు తాత్కాలికంగా వాయిదా



న్యూఢిల్లీ- నీలగిరివార్త :

యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట దక్కింది. యెమెన్ ప్రభుత్వం చివరిక్షణంలో ఉరిశిక్ష అమలును వాయిదా వేసింది. ప్రస్తుతం యెమెన్ ప్రభుత్వంతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆమెను రక్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించడంతో బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో నిర్ణయించిన ప్రకారం.. జులై 16న ఈ శిక్ష అమలుచేయాల్సి ఉండగా చివరి క్షణంలో స్థానిక అధికారులు దీన్ని నిలిపివేసినట్లు సమాచారం. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్నివిధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే

మిగతా 2వ పేజీలో..

## త్వరలో పంచాయతీ ఎన్నికలు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు



ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త :

హైకోర్టు ఆదేశాల మేరకు త్వరలోనే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు.గ్రామాల

మిగతా 2వ పేజీలో..

## ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్- నీలగిరివార్త :

ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మూసీ పునర్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు అందదని ఆయన అన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్, ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని అన్నారు. మా ప్రభుత్వ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, పెండింగ్

మిగతా 2వ పేజీలో..

# తెలంగాణకు అన్యాయం జరగదు

**బనకచర్లపై వాదనలు గట్టిగా వినిపించాలి : బండి సంజయ్**



**కరీంనగర్- నీలగిరివార్త :** తెలంగాణకు కేంద్రప్రభుత్వం ఎప్పుడూ అన్యాయం చేయదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మన తెలంగాణ వాదాన్నిసీఎం రేవంత రెడ్డి గట్టిగా వినిపించాలని కోరారు. కేంద్రానికి రెండు రాష్ట్రాలు సమానమే నని నొక్కిచెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని సీఎం రేవం త్రెడ్డి వివరించాలని సూచించారు. మంగళవారం కరీంనర్‌లో బండి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసే కుట్రలు జరుగుతు న్నాయని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం చేసే అన్యాయాన్ని బీసీ సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేలో బీసీలు 51 శాతం..కాంగ్రెస్ సర్వేలో మాత్రం 46 శాతమా అని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలపడం ఏంటని నిలదీశారు. బీసీలకు మిగిలేది కేవలం ఐదు శాతమేనని చెప్పు కొచ్చారు. బీసీ ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకించమని స్పష్టం చేశారు. బీసీల్లో ముస్లింలను కలిపితే ఆ ఆర్డినెన్స్‌ను మాత్రం అడ్డు కుంటామని హెచ్చరించారు. బీసీలను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. ఈ మోసంపై బీసీ సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీల్లో ముస్లింలను కలిపితే.. కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపదని తెలిపారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు

**గవర్నర్ వద్దకు చేరిన ఆర్డినెన్స్ ముసాయిదా**

**హైదరాబాద్ :** తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా రాజ్‌భవన్‌కు చేరింది. ఇటీవలే కేబినేట్ ఆమోదించిన రిజర్వేషన్ బిల్లుకు ఆర్డినెన్స్ తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్ చట్టంలో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉంది. అందులో 50శాతానికి మించకుండా అనేవాక్యాన్ని తొలగిస్తూ సవరించాలని నిర్ణయించారు. పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు సమీపిస్తున్నందున.. ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, సీఎం ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ముసాయిదాగా పంపించింది. గవర్నర్ ఆమోదం పొందితే చట్టసవరణ అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా డెడికే-టె-డ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే.

# రోహిత్ వేముల ఆత్మహత్యపై అనుచిత వ్యాఖ్యలు

**డిప్యూటి సిఎం భట్టికి బిజెపి అధ్యక్షుడు లీగల్ నోటీసులు**

**హైదరాబాద్ :** తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు షాక్ ఇచ్చారు. రోహిత్ వేముల ఆత్మహత్మపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు లీగల్ నోటీసులు పంపించారు. బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని.. 25 లక్షలకు పరువు నష్ట దావా వేస్తానని హెచ్చరించారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని బీజేపీ చీఫ్ తరపు న్యాయవాది అటాచ్ చేశారు.

## శ్రీధర్ బాబుతో ఫ్రాన్స్ కాన్సూల్ జనరల్ భేటీ

**హైదరాబాద్ :** డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది స్టేట్ మార్క్ లామీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో తెలంగాణ - ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సహా ఇరుపక్షాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. టీ-జీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇంకో ఇంజనీర్ ఇన్ చీఫ్!

మొదటిపేజీ తరువాయి..

అధికారులు సోదాలు నిర్వహించారు. మురళీధర్‌రావుకి సంబంధించిన కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లల్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భారీగా అక్రమ ఆస్తులను ఎసిబి అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మురళీధర్‌రావు కీలకంగా వ్యవహరించిన విషయం విదితమే. కాళేశ్వరం ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టుల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు ఎసిబికి ఫిర్యాదులు వచ్చాయి. వాటి ఆధారంగా ఎసిబి అధికారులు జరిపిన సోదాలలో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభిం చినట్లు సమాచారం. ఇలా ఉండగా మాజీ ఇఎన్సీ మురళీధర్‌రావును ఇటీవల కాళేశ్వ రం కమిషన్ విచారించిన విషయం తెలిసిందే. కాళేశ్వరం కమిషన్ జరిపిన విచారణలో మురళీధర్ రావును అడిగిన ప్రశ్నలకు, తనకు తెలియదని, మర్చిపోయానంటూ సమాధానం చెప్పారు. ఇక విజిలెన్స్ నివేదికలోనూ మాజీ ఇఎన్సీ మురళీధర్ రావు పేరును చేర్చించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మురళీధర్‌రావు పదవీవిరమణ పొందగా, ఆ తర్వాత ఆయన పదవీకాలాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన కొంతకాలం పాటు పదవిలో ఉన్నారు. మేడిగడ్డ కుంగిపోయిన ఘటనపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై ఎసిబి కూడా రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఈ క్రమంలో కాళేశ్వ రం ప్రాజెక్టులో గతంలో కీలకంగా పనిచేసిన అధికారుల అవినీతిపైన దృష్టిసారించిన ఎసిబి ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా పని చేసిన నూనె శ్రీధర్‌లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# లొంగిపోయిన మావోయిస్ట్ దంపతులు

- **వనం వీడి జనంలోకి రండి : సిపి అంబర్ కిషోర్ ఝా..**
- **ప్రజల నమ్మకం కోల్పోయిన మావోయిస్ట్ పార్టీ : మావోయిస్ట్ దంపతులు**



**నీలగిరివార్త - ఆదిలాబాద్ ప్రతినిధి:** వనం వీడి జనంలోకి రావాలని రామగుండం పోలీస్ కమిషనర్ సిపి అంబర్‌కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా మంగళవారం సిపి ఎదుట సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన దంపతులైనా రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆత్రం లచ్చన్న ఏ.రాజప్ప, గోపన్న 65, ఆయన భార్య చౌదరి అంకుభాయి ఏ అని తక్క, లక్ష్మి 55 లొంగిపోయారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మనది గొప్ప ప్రజాస్వామ్యమని ఇలాంటి వ్యవస్థలో ప్రభుత్వాలను వ్యతిరేకించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించి సామాన్య ప్రజానీకం ముఖ్యంగా గిరిజనులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్ట్ ఉద్యమం సాధించింది శూన్యమన్నారు. పోటీ ప్రపంచంలో మావోయిజం కాలం చెల్లిన సిద్ధాంతమని మావోయిస్టులకు నేటి యువత దూరంగా ఉందని అన్నారు. ప్రస్తుత సమాజంలో యువత చైతన్యవంతంగా వ్యవహరిస్తుందని, మావోయిస్ట్ రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గిపోయిందని స్పష్టం చేశారు. కొంతమంది ప్రజా సంఘాల ముసగులో దందాలు, సెటిల్మెంట్ చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నారని అలాంటి వారిపై పోలీసుల నిఘా ఉందన్నారు. అజ్ఞా తంలో ఉన్న మావోయిస్టులను జన జీవనస్రవంతిలోకి రావాలని లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస పథకాలు, పోలీస్ నుండి సహాయ సహకారాలు ఉంటాయని, స్వతంత్రంగా జీవించే విధంగా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

**ప్రజల నమ్మకం కోల్పోయిన మావోయిస్ట్ పార్టీ - మావోయిస్ట్ దంపతులు..**

ప్రజల నమ్మకం మావోయిస్ట్ పార్టీ కోల్పోయిందని నాలుగుదశాబ్దాల ఉద్యమం నమ్మిన సిద్ధాంతం నిరుపయోగం అని మావోయిస్ట్ దంపతులు అన్నారు. సమసమాజం స్థాపన అంటూ యువతను వాడుకుంటున్న ఉద్యమం స్వార్థంతో నిండిన ప్రపంచం అని అక్కడ అంత అసమానతలు అవహేళనాలని అక్షరాస్యత లేని తనలాంటి వారిపట్ల తీవ్రమైన అణచివేత వివక్ష ఉందన్నారు. నాలుగు దశాబ్దాల ఉద్యమం అనుభవం అనుబంధంతో అనారోగ్య పరిస్థితిలలో ప్రభుత్వం తమకు దిక్కు అయిందని ప్రభుత్వం తమను అందుకొని అండగా నిలిచిం దన్నారు. ఉద్యమం వైపు వెళ్ళవద్దని ఉద్యమం ఒక వ్యాపారం అని స్పష్టం చేశారు. సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సిరాజు, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, కోటపల్లి ఎస్సై రాజేందర్, నీల్వాయి ఎస్సై శ్యాం పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

# మలక్‌పేటలో కాల్పుల కలకలం

- **సీపీఐ నేత చందునాయక్ హత్య**
- **హత్యకు ముందు మంగళవారం ఉదయం ఇంటి వద్ద రెక్కీ!**
- **సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ బృందం సంఘటన స్థలానికి!**
- **క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు .. త్వరలోనే అరెస్టు చేస్తామన్న డీసీపీ**

**(ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త) :**



మలక్‌పేటలో కాల్పుల ఘటన కలకలం రేపింది. శాలివాహన నగర్ పార్కులో మార్నింగ్ వాక్ చేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు చందునాయక్ (43)పై గుర్తు తెలియని దుండుగులు ఆరురౌండ్ల కాల్పులు జరిపారు. కాల్పుల్లో చందు నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తన భార్య, కుమార్తె కళ్ల ముందే స్థానికులు చూస్తుండగానే స్విఫ్ట్‌కారులో వచ్చిన నలుగురు దుండగులు చందునాయక్‌పై కారం చల్లి కాల్పులు జరిపారు. చందునాయక్ స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సాయిపల్లి. కుటుంబంతో కలిసి చైతన్యపురిలో నివాసం ఉంటున్నాడు. భూతగదాల కారణంగానే హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టింది. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. నిందితుల కోసం 10బృందాలతో గాలింపు చేపట్టామని, సంఘటన స్థలంలో 5బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. నాగోల్ సాయినగర్‌లో గుడిసెలకు సంబంధించి నాలుగు సంవత్సరాల క్రితం భాను అనే వ్యక్తితో చందునాయక్‌కి ఘర్షణ తలెత్తింది. అప్పట్లో చందునాయక్ అనుచరులు భానుని హత్య చేసినట్లుగా సమాచారం. ఈ కేసులో చందునాయక్ సైతం నిం దితుడిగా ఉన్నారు. చందునాయక్‌ను హత్య చేసే ముందు దుండగులు మంగళవారం ఉదయం ఇంటి వద్ద రెక్కీ నిర్వ హించారు. ఇంటి నుండి చందునాయక్‌ను ఫాలో అయిన దుండగులు పార్క్ నుండి బయటికి రాగానే కాల్చి చంపారు.

# కేసీఆర్ హయాంలో 6.47లక్షల రేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి..

రేషన్ కార్డులు పంపిణీ చేశానని జగదీష్ రెడ్డి వెల్లడించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ,ఉద్యోగాల భర్తీ విషయం లో రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ అబద్దాలేనన్నారు. రేవంత్ స్థాయికి దిగజారి నేను మాట్లాడాలని కొందరు కోరుకుంటున్నారని కాని నేను అలా చేయబోనని రేవంత్ రెడ్డి మాట్లాడిన ప్రతి మాట అబద్ధమని సాక్ష్యాలతో నిరూపించానని చెప్పుకొచ్చారు. నిన్న రేషన్ కార్డుల పంపిణీ పేరుతో ప్రభుత్వ ఖర్చుతో సీఎం సభకు జనాలను తీసుకొచ్చారన్నారు. సీఎం అబద్దాలు మాట్లాడుతుంటే ప్రజలు స్పందించలేదన్నారు. సీఎం లేని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు మాలిన చర్య అని బూతులు తిడితేనైనా స్పందిస్తారని సీఎం బూతులకు తెగ బడ్డారన్నారు. సీఎం కు సంస్కారం, బుద్ధి పెరగలేదన్నారు. ఆయనను రోత మాటల రేవంత్ రెడ్డిగా పిలుచుకుంటున్నారన్నారు. నేను సోడాకలి పానో ,నీళ్లు కలిపానో? పక్కన బెడితే సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగా గురు దక్షిణ కింద కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి తరలించలేదని జగదీష్ రెడ్డి ఆరోపించారు. బనక చర్ల పై చంద్రబాబు రాసిచ్చిన వాఖ్యలనే రేవంత్ చదువుతున్నారు. తాను ఏదీ మాట్లాడినా రాసే ,చూపే భాజా బజంత్రీ మీడియా ఉందనే అహంకారంతో రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. జిల్లా నుంచి ఒక్కడినే గెలిచానంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డిపై జగదీష్ రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ మహామహులనే మట్టికరిపించానని భవిష్యత్ లో కూడా నేనేంటో నిరూపిస్తానని వచ్చే ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేను కూడా అసెంబ్లీకి రానివ్వనని సవాల్ చేశారు.

# కేరళ నర్స్ నిమిషకు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి..

ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించు కునేలా కొంత సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సం ప్రదింపులు జరిపాం. అవి ఫలించి మరణ శిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8. 6కో) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. ఉరికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో మోడీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఫలించి ఉరితీతు తాత్కాలికగా వాయిదా వేశారు. నిమిష కుటుంబం మాత్రం నిమిషను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న ఒకదారి అగమ్య గోచరంగా మారింది. హతుడి కుటుంబం అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే.. చివరి నిమిషంలోనైనా నిమిషకు ఉరి తప్పే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే నిమిష ప్రియ కుటుంబం బ్లడ్‌మనీ కింద 10 లక్షల డాలర్లు సిద్ధం చేసుకుంది. అయితే, నిమిష కుటుంబానికి, హతుడి కుటుంబానికి మధ్యవర్తిత్వం వహించిన లాయర్ దెబ్బకొట్టాడు. పెద్ద మొత్తంలో ఫీజు డిమాండ్ చేశాడు. తన ఫీజు చెల్లించే వరకు బ్లడ్ మనీ చర్చలు జరపనని తేల్చి చెప్పాడు. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన బ్లడ్‌మనీ వాయిదా పడింది. ప్రస్తుతం నిమిష ప్రియ కుటుంబం తరపున శామ్యుయెల్ జెరోమ్, షేక్ హబీబ్ హుమర్‌లు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. 10 లక్షల డాలర్లు వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని నిమిష కుటుంబం.. హతుడి కుటుంబానికి చెప్పిందని సమాచారం. అయితే, మృతుడి కుటుంబం మాత్రం బ్లడ్ మనీ విషయంలో ఇంకా ఎలాంటి సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. ఉరికి గంటల ముందు హతుడి కుటుంబం బ్లడ్ మనీకి ఒప్పుకుంటుందా అన్నది ఓ పెద్ద ప్రశ్నగా మారింది.

## త్వరలో పంచాయతీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి..

అభివృద్ధి పంచాయతీ కార్యదర్శులపై పడడం తో వారు సరైన అభివృద్ధి చేయలేకపోతున్నారని తెలిపారు. కేంద్రం నుండి సరైన నిధులు రాకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం తమపై భారం పడుతుందని చెప్పారు. అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులైనా కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక కమిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుక ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధితో పాటు కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బిల్లులు చెల్లిస్తూనే ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారికి బిల్లులు రాగానే తిరిగి సంఘాలకు డబ్బులు చెల్లించవలసి ఉంటుందని ఆమె చెప్పారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు క్లియిరెన్స్‌లు ఇవ్వండి

**కేంద్రానికి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ**

**(ప్రత్యేక ప్రతినిధి - నీలగిరివార్త) :** పాలమూరు, రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్‌లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా, గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం వెంటనే చొరవచూపాలని కోరారు. పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్లను కేంద్ర జలసంఘం ఆమోదించాలని, ఆ తర్వాత పర్యావరణ శాఖ, సీసీకు ఈసీ జారీ చేయాల్సిందిగా సిపారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా కరువు పీడిత ప్రాంతాల రైతులకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని ఉత్తమ్ తెలిపారు.

## అసెంబ్లీ ఆవరణలో ఆషాఢబోనాలు

**బంగారు మైసమ్మకు పూజలు చేసిన స్పీకర్**

**హైదరాబాద్ :** శాసనసభ ఆవరణలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ఆషాఢ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఆషాఢ మాసం బోనాలలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వినరసింహాచార్యులు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# మబ్బులు దాటి..

మొదటిపేజీ తరువాయి..

పెగ్గీ విట్సన్ తెలిపారు. అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. కాగా, భూమిపైకి చేరుకున్న ఈ వ్యోమగాయుల బృందాన్ని ఏడు రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నట్లు స్పేస్ ఎక్స్ అధికారులు తెలిపారు. శుభాంశు శుక్లా బృందం భూమికి సురక్షితంగా చేరుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు.. పట్టుదల, అంకితభావం, సాహస చర్యల ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇది మన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో సోమవారం బయలుదేరింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే. ఇకపోతే శుభాంశు శుక్లా తిరిగి భూమికి చేరుకోవడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఆయన తిరిగి భూమికి వచ్చిన సందర్భంగా స్వస్థలం లక్నోలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన తల్లిదండ్రులు భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ షాక్!

మొదటిపేజీ తరువాయి..

సింగిల్ ఎజెండా ఇచ్చింది. ఇప్పటికే కృష్ణాపై పెండిం గ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టు లుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల విని యోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే ఎజెం డాను తెలంగాణ సర్కార్ పంపింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల ఎజెండాపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈరోజు ఉదయాన్నే కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చించా ల్సిన అవసరం లేదని లేఖలో స్పష్టం చేసింది. జీఆర్ఎంబీ, సిడబ్ల్యూసీ, ఈఏసీ బనకచర్లపై తీవ్ర అభ్యంతరాలు తెలిపాయని ఇప్పటివరకు బనక చర్లకు ఎలాంటి అనుమతులు లేవంటూ పూర్తి వివరాలను ఈ లేఖలో ప్రస్తావించింది. అందుకే చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నీ ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదని ఉటంకించారు. గోదావరి,బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని లేఖలో ప్రస్తావించింది.

# బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జీనోమ్‌వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ గేమ్ ఛేంజర్

మొదటిపేజీ తరువాయి..

పవర్ బిల్లుల వన్ టైం సెటిల్మెంట్ గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలు పౌర సమాజం అంతా కలిసి పని చేద్దాం.. హైదరాబాదులో సృష్టించే సంపదను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్దామని, సంపద సృష్టించడం ఒక సాధన మాత్రమే మన ప్రజల గౌరవాన్ని పెంపొందించడం వారి ఆశయాలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమన్నారు భట్టి విక్రమార్క. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కి వందేళ్ల పైగా అనుభవం ఉందని, హైదరాబాద్ నగరం ఒక వర్తక నగరం నుంచి ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగే వరకు ప్రతి దశలోనూ ముందు నడిచిందన్నారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com
నీలగిరి వార్త
తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
బుధవారం 16-7-2025




# భూముల రీ సర్వేలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు

## జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ





**అల్లూరి జిల్లా పాడేరు నిలగిరి వార్త ప్రతినిధి**

ఈనెలాఖరు నాటికి భూములు రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. రీసర్వే లో జాప్యం ఎందుకు చేస్తున్నారని వి ఆర్ ఓలు, విలేజ్ సర్వేలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా భూ సర్వేలో పురోగతి సాధించలేని వి ఆర్ ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు.జలాశయాల పరిధిలో ఉన్న రైతులకు డిమాండ్ నోటీసు జారీ చేసి వారి నుండి నీటి పన్నులు వసూళ్లు చేయాలని ఆదేశించారు. తాహాశీల్దారు కార్యాలయాల్లో 12 ఆడిట్ పేరాలు పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలలో పునరావాస ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి, శబరి నదులు ప్రవాహాలు పరిశీలించి అధికారులు అప్రమ్తంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత, 22 మండలాల తాహాశీల్దారులు, డిప్యూటీ తాహాశీల్దారులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

# తల్లికి వందనానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వండి

## జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్

**అల్లూరి జిల్లా పాడేరు నిలగిరి వార్త ప్రతినిధి**

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బడి బయట పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. విద్య, డిఆర్ డిఏ బ్యాంకులు ఆర్థిక చేకూర్పు, గ్రామ సచివాలయాలు, ఐసిడి ఎస్, వైద్యా ఆరోగ్య శాఖ, నైపుణ్యాభివృద్ధి, గృహ నిర్మాణాల శాఖల పురోగతి పై కలెక్టరేట్ నుండి మంగళవారం వీడికాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం మంజూరులో జాప్యం చేయకూడదన్నారు. ఈనెల 16 నుండి ప్రత్యేక డ్రైవ్ పెట్టి ప్రతీ ఒక్కరికి ఆధార్ నమోదు చేయాలని చెప్పారు. ప్రతీ మూడువ శనివారం స్వచ్ఛాంధ్రా, స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిల్స్ ను నిరోధించాలన్నారు. ప్రతీ గ్రామం, మండల కేంద్రాలలో ఫ్రడే డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కాలుష్యపై అందరికి అవగాహన కల్పించాలని స్పష్టం చేసారు. పీ ఎం జన్మన్ పథకంలో మంజూరు చేసిన అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని చెప్పారు. ఎం. ఇ. ఓలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు ప్రతి రోజు రెండు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఎం ఇ ఓలు ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి మార్గదర్శిని కార్యక్రమాన్ని అమలు చేయాలని చెప్పారు. పి ఎం జన్ మన్ పథకం లో మంజూరు చేసిన గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. 8 వేల గృహాలను ఇంకా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పూర్తి చేసిన గృహాల నిధులు విడుదలవు తున్నాయని చెప్పారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటిడి ఏ పి ఓ కె. సింహాచలం, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డి ఆర్ డి ఏ పిడి వి. మురళి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. టి. విశ్వేశ్వర నాయుడు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, ఎల్ డి ఎం మాతు నాయుడు, ఇ ఇ హౌ సింగ్ బాబు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం





**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి లక్ష్యం చాగల్లు మండలం ఉనగట్ల గ్రామంలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. స్థానిక తెలుగుదేశం నాయకులతో కలిసిఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసినఅభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పథకాలు గురించి ప్రజలకు వివరించారు అనంతరం కరపత్రం అందజేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడమే కూటమిప్రభుత్వ లక్ష్యమని తెలిపారు గ్రామంలో పారిశుద్ధ్యం, వీధిదీపాలు,మంచినీరు,డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా, చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, బొల్లెన్న శివ నాగేంద్ర, నాయకులు శ్రీను, తాళ్లూరి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మనల్ని ఎవడురా ఆపేది లం... లు???

## అక్రమ వ్యాపారాలకు చోడవరంను అడ్డాగా మార్చిన తెలుగుదేశం, కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు, మీడియాకు ఎమ్మెల్యే వేధింపులు బెదిరింపులు.

**చోడవరం నీలగిరి వార్త ప్రతినిధి**

అక్రమ ఇసుక, మట్టి, గ్రావెల్ వ్యాపారాలు దర్జాగా సాగిస్తున్న అధికార, ప్రతిపక్ష నేతలు... - వాళ్లు, వీళ్లు కుమ్మక్కై చెరువులు, కొండలు, ప్రభుత్వ భూములు పంచుకుంటున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గం అక్రమ వ్యాపారాలు, వేధింపులు బెదిరింపులకు స్థానిక ఎమ్మెల్యే, కూటమి నాయకులు అడ్డాగా మార్చారని మహిళ, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నేత రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో సమావేశమైన కార్మిక, కర్షక నేత రెడ్డిపల్లి మాట్లాడుతూ ప్రజా ఉపయోగకరంగా చెరువులు, రహదారులు మరమ్మత్తులు చేపట్టమని అధికార ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పినప్పటికీ, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ స్థానిక టి.డి.పి. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, జనసేన, బిజెపి, ... కూటమి నాయకుల అండదండలతో దర్జాగా అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారని తెలియజేశారు. ప్రశ్నించే మీడియా, ప్రజా సంఘాలు, సర్కారు ఉద్యోగులు, అధికారులపై తిరగబడుతూ "మనల్ని ఆపేది ఎవడురా" లం... లు అంటూ వేధింపులు, బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. అధికార, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కై భూ కుంభకోణాలు, ... అక్రమంగా ఇసుక, గ్రావెల్, మట్టి దందాలు కొనసాగిస్తున్నారన్నారు. అభివృద్ధిలో నియోజకవర్గం వెనకబాటును పట్టించుకోని ఎమ్మెల్యే రాజా వారు అక్రమ వ్యాపారులపై ప్రశ్నించే గొంతులను బలవంతంగా



నొక్కేస్తున్నారని తెలియజేశారు. నెలవారి మామూలు లంచాలతో రెవెన్యూ, పోలీస్, పంచాయితీ అధికారులను కట్టిపడేస్తున్నారన్నారు. ప్రజా సంఘాలు, గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీసులు, రెవెన్యూ అధికారులు రైడింగ్ కి వచ్చినప్పటికీ నెల మామూళ్లు దండుకుంటున్న దిగువ స్థాయి ఉద్యోగులు అక్రమార్కులకు ఉప్పందిస్తున్నారని తెలియజేశారు. అంతేకాకుండా తెలుగుదేశంలో ఏర్పడ్డ ముఠా కక్షలతో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎమ్మెల్యే వేధింపులతో బుచ్చయ్యపేట ఎండిఓ విజయలక్ష్మి ప్రాణాలు హఠాత్తుగా బలి తీసుకోగా, వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ గుండెపోటు తో ఆసుపత్రిపాలైన ఘనత వీరిదే అన్నారు. ఇప్పటికే షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్న విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జనసేనాని రాజు చర్యలతో చోడవరం నియోజకవర్గంలో పని చేయాలంటే అధికారులు, ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారని తెలియజేశారు. మీడియా పై ఏహ్య స్వభావం గల ఎమ్మెల్యే, తనకు తాళం కొట్టే వారినే తప్ప,...



మిగిలిన వారిని కార్యాలయం చుట్టుపక్కల కూడా రానివ్వరనే ఆరోపణలు ఉన్నాయన్నారు. భజన బ్యాచ్ తప్ప మిగిలిన విలేకరులు పొరపాటున వెళ్లినను, కెమెరాలు, ఫోన్లు లాక్కున్న సంఘటనలు కోకొల్లలు. నియోజకవర్గంలో అక్రమ ఇసుక, మట్టి, గ్రావెల్ వ్యాపారాల్లో కూటమిలో మూడు పార్టీలతో పాటు, ప్రశ్నించకుండా ఉండేందుకు ప్రతిపక్షానికి కూడా వాటా అందజేస్తున్నట్లు తెలిపారు. కనీసం డ్రైవింగ్ లైసెన్సు లేని, మైనర్లు ... ఇసుక, మట్టి, గ్రావెల్ వాహనాలను నడుపుతూ పలు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నారు అని తెలిపారు. దీనిపై తక్షణమే జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి అధికారులు సి.బి.సి.ఐ.డి తో విచారణ జరిపి నిష్పాక్షికంగా రాజకీయ నేతలు, లంచావతారులైన బాధ్యతగల ప్రభుత్వ అధికారులు, షాడోలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కార్మిక, కర్షక నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, ప్రజా మహిళా ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను ధ్వంసం చేస్తున్న జీవో నెంబర్ 117 రద్దు చేయాలి

## తల్లికి వందనం పథకం అందరికీ అమలు చేయాలి !!

## ఆక్రమణలకు గురవుతున్న హైస్కూల్ ప్రాంగణాన్ని కాపాడి, పూర్తిగా ప్రహరీ నిర్మించాలి!!

**చోడవరం నీలగిరి వార్త ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబర్ 117 రద్దు చేయాలని విద్యార్థి సంఘం (పిడిఎస్ఓ) ఆధ్వర్యంలో చోడవరం మెయిన్ హై స్కూల్ విద్యార్థులతో మంగళవారం పాఠశాల సమస్యలపై నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. భాస్కర్ మాట్లా డుతూ గత వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ 117 తీసుకొచ్చి పాఠశాల వ్యవస్థను నాశనం చేసిందని, మేము అధికారంలోకి వస్తే ఆ జీవో ను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేస్తా మని యువగలం పాదయాత్రలో హామీ ఇచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 16,343 టీచర్ పోస్టులు తీసి, ... దానిని సిగ్గు లేకుండా మెగా డీఎస్సీ అని ప్రచారం చేసుకున్నారని అన్నారు. ఇప్పుడు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలో 12,512, ప్రాథమిక పాఠశాలలో 39,008 పోస్టులు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 11,888 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే టీచర్ పోస్టులు ఇంకా మిగిలి ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం దొంగ నాటకాలు ఆడు





తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని, హాస్టల్ లోని, గిరి జన ఆశ్రమాల్లోని పిల్లలను ప్రభుత్వ కార్యక్రమాలకు, యోగా డేలకుఉపయోగించుకుంటున్నారు, కానీ ఆ హాస్టల్లో పెచ్చులూడి పోతున్నను, గదులు కూలిపోయే పరిస్థితుల్లో ఉన్నను, ... హాస్టల్లో, మంచినీటి సదుపాయం లేక సరైన తిండి లేక దోమల బెడదతో జ్వరాల బారిన పడుతూ ఇబ్బంది పడుతున్న విద్యార్థుల సమస్యలను పట్టించుకోవట్లేదు అన్నారు. పాఠశాల పునర్వ్యవస్థీకరణ, నో బ్యాక్ డే, కిట్ల పంపిణీ అంటూ పాలకులు ఒకవైపు ప్రచారం చేస్తూమరోవైపు వేల పాఠశాల లను మూసేస్తున్నారని తెలిపారు. తల్లికి వందనం పథకం కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు మళ్లిస్తుంది అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యొక్క ఫీజులు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పునర్వ్యవస్థీకరణ పేరుతో పాఠశాల విభజన చేపడుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 19, 21, 117 లను వెంటనే రద్దు చేయాలని, పాఠశాల విలీనాలన్నీ వెంటనే ఆపాలని, మూసివేసిన పాఠశాలలను తెరవాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, కాస్మోటిక్స్ , మెయింటెనెన్స్ ఛార్జీలను ఇవ్వాలని హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలకు గురవుతున్న స్థానిక ప్రభుత్వ హై స్కూల్ లో, ప్రహరీ గోడను నిర్మించి దురాక్రమణల బారి నుండి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా నాయకులు మజ్జి.మనోజ్, కె. రామకృష్ణ, బి.గణేష్, బి. కుమార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వైసీపీలో కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత





## మాజీ ఉపముఖ్యమంత్రి బూడి

**చీడికాడ నీలగిరి వార్త ప్రతినిధి**

ప్రస్తుత తరుణంలో కార్యకర్తలకే వైసీపీ అధిక ప్రాథమిక ఇస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా చీడికాడ తులసి కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్య కర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అది ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రజలకు స్వర్గం చూపించామని, అటువంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను అష్ట కష్టాలు పాలు చేసిందని నేటికి రైతన్నకు సహాయం అందించలేదని ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడుతున్నారని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నాలుగేళ్ల అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ దిశలో ప్రతి ఒక్కరూ కలిసి శ్రమించి వైసీపీ జెండా ఇరవై వేషం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చీడికాడ గ్రామా శాఖ అధ్యక్షులు పరవడం మహేష్, కరగణ శివకుమార్, అమ్మ ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పిటిసి లాలం జానకి వరలక్ష్మి, వైసిపి పార్టీ నేతలు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోదకొండమ్మ ఆలయంలో అన్నసమారాధన



**పాడేరు నీలగిరి వార్త ప్రతినిధి**

తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దన్నెటి పలాసి సురేష్ 38వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా మంగళవారం గిరిజనుల ఇలవేలుపు కోరికలు తీర్చే కలపవల్లి శ్రీ శ్రీ శ్రీ మోదకొండతల్లి మాలయంలో సుమారుగా 500మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అనేకమంది స్నేహితులు నాయకులు కుటుంబ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకొని నిండు నూరేళ్లు ఆయుస్ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని గిరిజన ప్రాంతంలో మీ సేవలు మరింత చేపట్టాలని, దినదిన అభివృద్ధి చెంది అనేక మందికి ఆదర్శంగా నిలవాలని దీవించారు. కిల్లో కోటిబాబు నాయుడు.దాన్నెటి పాలసీ రాంబాబు.వంజంగి కాంతమ్మ . కోడా కోటిబాబు.కార్లు నాయుడు.బండారు ఉదయ్ భాస్కర్ . వంచేల శివ .బౌడు ప్రవీణ్ పాల్గొన్నారు.

## తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న జర్నలిస్ట్ సీత భూపాల్



**నీలగిరి వార్త నారాయణఖేడ్ జూలై 15:**
తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఆదివారం వరంగల్ లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన సీత భూపాల్ కు ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్ గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేశారు. జర్నలిజం రంగంలో చేస్తున్న కృషిని గుర్తించి ఇట్టి అవార్డును ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో వీరితో పాటు సినిమా డైరెక్టర్ సేనాపతి, తెలంగాణ స్టేట్ అడ్వకేట్ జె.ఎ.సి కన్వీనర్ శ్రీమతి మంజుల, బి.సి.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండ లలిత హైకోర్టు అడ్వకేట్ అండ్ సోషల్ వర్కర్ శ్రీమతి స్వరలత, సమాచార హక్కు చట్టపరిరక్షణ కమిటి తెలంగాణ శ్రీమతి అనిత, వుమెన్స్ స్కిల్ డెవలప్ మెంట్ ఆత్మ నిర్భర్ కాంచన్ జోషి, జై భీమ్ పార్టీ స్టేట్ ప్రెసిడెంట్ ఉమాదేవి మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా ప్రతి గ్రామాన కాషాయ జెండా ఎగరవేయాలి

- ఎల్కతుర్తి బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్
.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి
.రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్
. హుస్నాబాద్ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి
. జిల్లా కౌన్సిల్ మెంబర్ కుడితాడి చిరంజీవి
. శక్తి కేంద్రం ఇన్చార్జిలు బూత్ అధ్యక్షులు
ముఖ్య కార్యకర్తలు





**ఎల్కతుర్తి నీలగిరి వార్త ప్రతినిధి జూలై 15**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం లో నిర్వహించినటు వంటి భారతీయ జనతా పార్టీ మండల స్థానిక సంస్థ ఎన్నికల సన్నాహక సమూహం కార్యక్రమాన్ని ఎల్కతుర్తి మండల పరిధిలోని ఎస్ ఆర్ ఎమ్ ఫంక్షన్ హాల్ లో బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి రాష్ట్ర ఓబిసి మోర్చ కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్ హుస్నాబాద్ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ కుడితాడి చిరంజీవిలను మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ గౌరవంతో స్టేజ్ పైకి ఆహ్వానించినాడు అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కార్యకర్త అనేవాడు ఒంటెద్దులా ఒక్కడే కాకుండా అందరినీ కలుపుకొని ఇకనుండి అయినా కార్యకర్తలు ఒకరిపై ఒకరికి ఉండే మనస్పర్ధలను పక్కన పెట్టి స్థానిక ఎన్నికల్లో విజయ పరంపరతో ప్రతిపక్ష పార్టీలకు దీటుగా సమాధానం చెప్పాలి అని ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మైకు ఇవ్వగా స్థానిక సంస్థల ఎన్నిక సమావేశానికి హాజరైన ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశాడు స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రతి గ్రామంలో అభ్యర్థులను గుర్తించి వారిని వార్డ్ మెంబర్ స్థాయి నుండి జడ్పిటిసిగా బిజెపి పార్టీ తరఫున నిలబడిన ప్రతి ఒక్క అభ్యర్థిని గెలిపించుకోవడానికి కావలసిన తగు సూచనలను ఇస్తూ ఏవిధంగా ప్రజల్లోకి వెళ్లాలో పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ కచ్చితంగా ప్రతి ఒక్క గ్రామాలలో కాషాయపు రంగు జెండా ఎగురవేయాలని దానికోసం నిర్విరామంగా కృషి చేయాలని తెలియజేశారు అలాగే హుస్నాబాద్ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోమ్ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసే కృషిని వివరిస్తూ కేంద్ర బడ్జెట్ నుండి ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామ గ్రామాన మంచినీటి బోర్లు మరియు కనీసం నడకబాటకు వీలులేని దారిలో ప్రతి ఊరిలో సిసి రోడ్లు కమ్యూనిటీ హాల్స్ సెంటర్ లైటింగ్స్ ఓపెన్ జిమ్స్ ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామాల అభివృద్ధి విషయంలో కేంద్రం అనేక సంక్షేమ కార్యక్రమాలతో అభివృద్ధి పథంలో గ్రామాలను ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేస్తుందని ఈ కేంద్ర సంక్షేమ పథకాలన్నీటిని వివరిస్తూ స్థానిక ఎన్నికలలో జనం దృష్టికి తీసుకువెళ్లి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలకు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు శక్తి కేంద్ర ఇన్చార్జిలు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి హుండీ లెక్కింపు



**నీలగిరి వార్త భీమదేవరపల్లి ప్రతినిధి జులై 15:**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి సమేత భద్రకాళి హుండి లెక్కింపు కార్యక్రమం మంగళవారం రోజున దేవాలయ ఆవరణంలో నిర్వహించడం జరిగింది వీరభద్రుడి హుండీ ఆదాయం మొత్తం ఐదు లక్షల 73 వేల 374 రూపాయలు వచ్చినవి ఇందులో నోట్లు ఐదులక్షలఇరవై మూడు వేల ఎనిమిది వందల అరవై రూపాయలు కాయిన్స్ 49వేల 514 వచ్చినట్లు దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి ఆలయ కార్య నిర్వహణ అధికారి పి కిషన్ రావు తెలిపారు ఈ యొక్క హుండి లెక్కింపు కార్యక్రమంలో స్థానికులు పిడిశెట్టి కనకయ్య పూదరి రవీందర్ గౌడ్ సదా నందం శ్రీనివాస్ మరియు రాజా రాజేశ్వరి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు ఆలయ ముఖ్య అర్చ కులు మొగిలిపాలెం రాంబాబు ఉప ప్రధాన అర్చకులు రాజయ్య. శ్రీకాంత్ రమేష్ సందీప్ శ్రావణ్ శరత్ చంద్ర శివకుమార్ ఆలయ సిబ్బంది శ్రీధర్ అనుషరాజ్ రాజేందర్భక్తులు పాల్గొన్నారు.

## రైళ్లు హాల్టింగ్ కోసం జిఎంని కలిసిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి





**కొవ్వూరు. నీలగిరి వార్త ప్రతినిధి**
కొవ్వూరు సికింద్రాబాద్ రైల్వే జిఎం కార్యాలయంలో రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి తో కలిసి తూర్పు గోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మరియు కొవ్వూరు బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీ కృష్ణ , బిజెపి నాయకులు ఉన్నికృష్ణన్ సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మరియు ఇతర సంబంధిత అధికారులను మంగళవారం కలిశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్ల హాల్టింగ్స్ గురించి చర్చించడం జరిగింది.కొవ్వూరు రైల్వే స్టేషన్ లో పూర్వ కరోనా ముందు రైళ్ల హాల్టింగ్స్ ను పునరుద్ధరణ చేయాలని ఎంపీ పురంధేశ్వరి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, నాయకులు పిల్లలమర్రి మురళీకృష్ణ, ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. కొవ్వూరు పరిసర ప్రాంతాల ప్రజలు కొవ్వూరు రైల్వే స్టేషన్ లో కోవిడ్ పూర్వ రైళ్ల హాల్టింగ్స్ లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని జిఎం దృష్టికి రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి తో కలిసి జిఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ కి వివరించారు. వివిధ కారణాలు సాకు చూపి రైళ్ల హాల్టింగ్స్ పునరుద్ధరణ చేయకపోవడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం అని పురంధేశ్వరి జిఎం కి తెలిపారు. ప్రజా అభీష్టం మేరకు రైళ్ల హాల్టింగ్స్ ను పునరుద్ధరణ చేయాలని విజ్ఞప్తి చేయగ. జిఎం రైల్వే అధికారులందరూ సానుకూలంగా స్పందించారు. అని తప్పకుండా త్వరలోనే రైళ్ల హాల్టింగ్స్ సాధిస్తామన్నారు.

## డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

**మైనర్ బాలికకు గర్భస్రావం కావడానికి (అబార్షన్) మందులు విక్రయించిన మెడికల్ షాప్ యజమానిపై కేసు నమోదు, రిమాండ్ కు తరలింపు**
**మెడికల్ షాప్ నిర్వాహకులకు వేములవాడ ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి హెచ్చరిక**



**నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
మైనర్ బాలికకు గర్భస్రావం అబార్షన్ అయ్యేలా మందులు విక్రయించిన మెడికల్ షాప్ యజమానిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వేములవాడ ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఓ మైనర్ బాలికను సిరిసిల్లకు చెందిన ఓ యువకుడు ప్రేమ పెళ్లి పేరుతో అట్టి మైనర్ బాలికను శారీరకంగా వాడుకొగా అట్టి బాలిక గర్భం దాల్చగా అట్టి గర్భం పోవడానికి సిరిసిల్ల పట్టణానికి చెందిన గీతాంజలి మెడికల్ షాప్ యజమాని నల్లా శంకర్ ను ఆశ్రయించి ఒక మైనర్ బాలికకు గర్భం పోవడానికి మందులు ఇవ్వమనగా అట్టి గీతాంజలి షాప్ ఓనర్ చట్ట వ్యతిరేకంగా ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భం పోవడానికి మందులు ఇవ్వగా అట్టి మందులను వేసుకున్న మైనర్ బాలికకు గర్భ స్రావం అయినది. ఈ విషయంపై కేసు నమోదు చేసి గతంలో అట్టి యువకుడిని మే 30న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. మరియు చట్ట వ్యతిరేకంగా మైనర్ బాలికకు గర్భం పోవడానికి మందులు ఇచ్చిన గీతాంజలి మెడికల్ షాప్ ఓనర్ నల్ల శంకర్ ను 12- 07- 2025 రోజున రిమాండ్ కు తరలించనైనది

**డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు**
ఈ సందర్భంగా ఏ.ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ పిస్క్రిప్షన్ లేకుండా మరియు చట్టానికి వ్యతిరేకంగా మెడికల్ షాప్ నిర్వాహకులు ఎవరైనా మందులు విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందులు విక్రయిస్తున్న తరుణంలో నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే వారినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు: ఎస్సై కే.పాపినాయుడు




**దుంబ్రిగూడ: నీలగిరి వార్త ప్రతినిధి**
క్రమశిక్షణతో కూడిన చదువు బంగారు భవిష్యత్తుకు దోహదపడుతుందని ఎస్సై పాపినాయుడు అన్నారు. మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత, బాలుర ఆశ్రమ పాఠశాలలో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ కార్యక్రమాన్ని మంగళవారం మంగళవారం నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి, పొగాకు వంటి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. పాఠశాల స్థాయిలో ఉన్నత చదువులకు తోడ్పాటునిచ్చుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడలు శారీరక ఎదుగుదలను అందిపుచ్చుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి బంగారు భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో.పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో కార్మికులకు వైద్య పరీక్షలు మందుల పంపిణీ

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్**
**ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్**





**నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
సిరిసిల్లలోని నెహ్రూనగర్ నందు మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నందు గల పవర్ లూమ్ కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ కౌన్సిలింగ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినారు ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ హాజరై కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ కార్మికులతో మద్యపాన వ్యసనం గురించి, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి మాటాడిన అనంతరం మద్యం మానేయాలనుకున్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యపాన వ్యసనం ఒక సైకోసోమాటిక్ డిసార్డర్ వ్యాధి అని తెలిపారు. ఇది మెదడు, నరాల వ్యవస్థ మీద చూపే ప్రభావం వల్ల వ్యక్తి చిత్ర విచిత్రంగా ప్రవర్తిస్తాడని తెలిపారు దురలవాట్లు మానసిక సమస్యలు వ్యాధులు నుండి బయటపడేందుకు ప్రభుత్వ సాధారణ వైద్యశాలలో తనను సంప్రదించాలని కోరారు సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ అతిగా మద్యపాన వ్యసనానికి లోనైన వ్యక్తిలో పారానాయిడిజం అనే అనుమాన ప్రవృత్తి పెరుగుతుందని తెలిపారు. తద్వారా భార్య శీలాన్నీ శంకించడం భార్యపై అనుమాన ప్రవృత్తి పెరగడం వల్ల కుటుంబ సంబంధాలు విచ్చిన్నమౌతాయని అన్నారు వ్యసనాల నుండి త్వరగా బయట పడేందుకు మందులు, కౌన్సిలింగ్ ప్రతి వార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు తంబాకు నమలడం బీడీ సిగరెట్ త్రాగడం మొదలగు వ్యసనాలు మానుకునేందుకు మైండ్ కేర్ సెంటర్ ను సంప్రదించాలని పున్నంచందర్ తెలిపారు కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని తెలుపుతూ త్రిఫ్ట్ పథకం, నేతన్న భీమ మహిళాశక్తి చీరల ఉత్పత్తి పథకం యార్న్ సబ్సిడీ లాంటి వాటిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ కె. పున్నంచందర్, వస్త్రోత్పత్తి దారుడు బూట్ల సుదర్శన్ మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది బూర శ్రీమతి మరియు కార్మికులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న సర్దార్ నాయక్

**నీలగిరి వార్త ఎల్లారెడ్డి (సదాశివ్ నగర్):**
సదాశివనగర్ మండల కేంద్రంలో నిర్వహించినటువంటి యూత్ కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సర్దార్ నాయక్ యూత్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ బాధ్యులు యూత్ కాంగ్రెస్ కమిటీని అన్ని గ్రామాలలో బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. యూత్ కమిటీ లేని గ్రామాలలో నూతన యూత్ కమిటీలు వేయాలని రాష్ట్ర యూత్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి కామారెడ్డి జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు భరత్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కమిటీలు వేయాలని అధ్యక్షుడు చెప్పడం జరిగింది. సదాశినగర్ మండల యూత్ కమిటీ సమీక్ష సమావేశంలో పాల్గొన్నవారు యూత్ అధ్యక్షులు భాస్కర్, గంగాధర్ , సాయి రెడ్డి, బాలరాజు మండల కేంద్ర అన్ని గ్రామాలలో సభ్యులు మామిడాల స్వామి జంగం ప్రసాద్, బాలాజీ , డైరెక్టర్ ఆశ సురేష్ హాజీ, రాజ మైసయ్య గౌడ్, హరి నారాయణ,రమేష్, భాను ప్రసాద్, మధు, సంతోష్ నాయక్, రమేష్, శేఖర్, చరణ్, రామ్ చరణ్.



## మండల పరిషత్ మీటింగ్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరణ

**నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

**3 నెలల జీతాలు రాకపోతే ఉద్యోగం ఎలా చేసుడు అని నిరసన**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం ఎంపీడీవో పెట్టిన మీటింగ్ ను ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించడం జరిగింది గత మూడు నెలల నుండి జీతాలు రానందున మీటింగ్ ను బహిష్కరించారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు పారెల్లి రమణ జిల్లా ప్రధాన కార్యదర్శి అవునూరు వెంకటేష్ మండల ఉపాధ్యక్షులు మంద నారాయణ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని శ్రీనివాస్ క్యాషియర్ బాస రఘు నందన్ ప్రచార కార్యదర్శి కొమ్ము రమేష్ అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొనడం జరిగింది అని తెలిపారు.

## పరిస్థితిలో మార్పు వచ్చింది: జిఎం దేవేందర్

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**
మందమర్రి భూగర్భ గనులలో హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి పాటుపడాలనీ జిఎం దేవేందర్ అన్నారు. ప్రస్తుత ఉద్యోగుల తల్లిదండ్రులు విధులు నిర్వహించిన సమయంలో ఉన్న పరిస్థితులు నేడు లేవు అని అన్నారు. స్థానిక %జజు=% క్లబ్ వేదికగా కాసిపేట ఒకటి, రెండోవ గనులలో కనీసం నూరు మస్టర్లు చేయని, గైర్హాజరు ఉద్యోగులకు జనరల్ మేనేజర్ జి. దేవేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని అన్నారు. గైర్హాజరు ఉద్యోగుల తల్లిదండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, కావున ప్రతి ఒక్క ఉద్యోగి తమ యొక్క హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడ లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి నుండి అయినా ఉద్యోగులు ప్రతినెల 20 మస్టర్ల చేయాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ లో 214 మందికి గాను 74 మంది గైర్హాజరు ఉద్యోగులు కుటుంబ సభ్యులతో



హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్, ఏ.ఐ.టి.యు.సి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ రమేష్, కేకే డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కందుల శ్రీనివాస్, సింగరేణి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం వేడుకలు




**దేవరకొండ నీలగిరి వార్త**

ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవ సందర్భంగా మంగళవారం స్థానిక ట్రైబల్ కాలేజీలో స్కిల్ డెవలప్మెంట్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది అందులో ఫస్ట్ సెకండ్ థర్డ్ ఫోర్త్ బహుమతులు అందజేయడం జరిగిందనీ, ఈ పోటీలలో 80 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్విటి మాట్లాడుతూ 2014లో, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూలై 15ని ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవంగా ప్రకటించిందనీ యువతకు ఉపాధి, మంచి పని మరియు వ్యవస్థాపకత కోసం నైపుణ్యాలను సమకూర్చడం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను జరుపుకోవడానికి. 15 జూలై న ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం నిర్వహించుకుంటారని అన్నారు. సమాజానికి యువత శక్తి ఎంతో అవసరమని, యువతలో ఉన్న నైపుణ్యాన్ని తెలియజేసుకోవడం, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఆ యువత సరైన మార్గంలో నడవాలని సందర్భంగా వారున్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం అధ్యక్షుడు ఎన్విటి , మేరా భారత్ ఆర్గనైజర్ కొండల్, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత కలిసి బహుమతులు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, చక్రపాణి, రాము, శ్యామల, మీనేశ్వరి ,స్వాతి,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతున్న బిజెపి





**దేవరకొండ నీలగిరి వార్త**

దేవరకొండ రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతుందని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నల్గొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ లోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నా రని. అసమానతలు లేని సమాజం నిర్మించడమే కమ్యూనిస్టుల లక్ష్యమని, కమ్యూనిజానికి అంతం లేదని, మానవ సమాజం ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా 23వ,జిల్లా మహాసభ దేవరకొండ పట్టణంలోని అమరజీవి లిమందడి నర్సింహా రెడ్డి ప్రాంగణం (సాయి రమ్య ఫంక్షన్ హాల్)లో నిర్వహించారు. మహాసభకు ముందు లిసిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎమ్మెల్యే, పల్లా వెంకట రెడ్డి సిపిఐ పతకాని ఎగురవేశారు మహాసభ ప్రారంభ ఉపన్యాసంలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత శ్రమ జీవులు, కార్మికులు కలిగిన పెద్ద పార్టీ కమ్యూనిస్టు అని ప్రపంచంలో ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బిజెపి లాంటి ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమిత మైతారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలుగా పూర్తి చేసుకుందని, పేదల పక్షాన నిలబడేది ఎర్ర జెండా పార్టీ అని ఆయన కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అమిత్ షా 2026 మార్చి వరకు అంతం చేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. ఈ మహా సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పల్లా దేవేందర్ రెడ్డి, టి వెంకటేశ్వర్లు, బొ ల్లె మంజుల అధ్యక్ష వర్గం వహించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సినియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి,ఉజ్జిని రత్నాకర్ రావు,ఉజ్జిని యాదగిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య,గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్,ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,ఆర్ అంజ చారి,బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు,బొల్లగిరి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, వల్లమల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## మన అమ్మ హాస్పిటల్‌లో రెండు అరుదైన శస్త్ర చికిత్సలు



**నీలగిరి వార్త, సూర్యాపేట:-**

స్థానిక మన అమ్మ హాస్పిటల్ నందు అరుదైన శస్త్రచికిత్స లు చేశారు. యండ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళా గత కొన్ని సంవత్సరాలుగా కాలికి వేరికోస్ అల్సర్‌తో బాధపడుతున్నారు. సూర్యాపేట మన అమ్మ హాస్పిటల్‌లో సంప్రదించగా అపోల్లో హాస్పిటల్ డాక్టర్ అజయ్ వాస్క్యులర్ సర్జన్ సూర్యాపేట లోనే మొట్టమొదటి సరిగా కోతల్లేకుండా , బ్లీడింగ్ లేకుండా లేజర్ అబ్లేషన్ పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించారు. పేషెంట్ మొదటి రోజే తిరిగి సాధారణ స్థితిలో నడవగలిగారు. డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ సుప్రజ ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు.

2) చిన్నతనం నుండి నాలుక అతుక్కుని ఉన్నటువంటి మహిళ కి కోత లేకుండా, బ్లీడింగ్ లేకుండా లేజర్ చికిత్స ద్వారా మన అమ్మ డెంటల్ హాస్పిటల్ లో డాక్టర్.రుక్మిణి చిత్ర (సూర్యాపేట లో మొట్ట మొదటి నోటి క్యాన్సర్ స్పెషలిస్ట్), డాక్టర్ వినయ్ సర్జరీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ హాస్పిటల్ వైద్యులకు పలువురు ప్రముఖులు అబినందనలు తెలిపారు...

## కనీస వేతనాల చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

**టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి.**




**నీలగిరి వార్త, హుజూర్ నగర్**

రాష్ట్రంలో వివిధ పరిశ్రమలలో భద్రత ప్రమాణాలపై ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ నిరంతరం తనిఖీలు చేపట్టాలని,అందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం వివిధ రంగాల కార్మికులతో టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోషపతి మాట్లాడుతూ సంగారెడ్డిలో సిగాచి పరిశ్రమ వాడలో 45 మంది ప్రాణాలు గాల్లో కలిసి పోయాయని,ఎనిమిది మంది ఆచూకీ లభించలేదని,వివిధ ఆస్పత్రిలో 33 మంది చికిత్స పొందుతున్నారని,వీరికి ప్రకటించిన ఆర్థిక సహాయం మృతి చెందిన వారికి కోటి రూపాయలు,ప్రమాదంలో గాయపడ్డ వారికి 50 లక్షలు ఇవ్వాలని కోరారు. పారిశ్రామిక విధానాల చట్టం 1947,ఫ్యాక్టరీల చట్టం 1948,కనీస వేతనాల చట్టం 1948 సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శీతల రోషపతి. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సిమెంటు పరిశ్రమలలో,వివిధ పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చూడాలని,ప్రతి పరిశ్రమ చెకప్ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రాజధాని అయిన హైదరాబాదులో కల్తీకల్లు వల్ల పదిమంది మృతి,34 మంది చికిత్స పొందుతున్నారని,రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి కల్తీ కల్లు విక్రయించకుండా నివారించాలని,వివిధ కూలీ పనులు చేసుకొని అలసిపోయిన కార్మికులు కల్లు సేవించిన వారు ప్రాణాల మీదికి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి నాయకులు గుండెబోయిన వెంకన్న యాదవ్,రామయ్య,ప్రకాష్,ఆజాద్,ప్రభాకర్, ప్రసాదు, సతీష్, వెంకటేశ్వర్లు,రాములు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ చొరవతో ఎల్ ఓ సి మంజూరు

**మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగలక్ష్మి జితేందర్ రెడ్డి సహకారంతో**


CHIEF MINISTER'S OFFICE



**నీలగిరి వార్త పాలకీడు**

వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పేదరాలి కుమారుడు తాళ్ల పెల్లి చందు పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ చూపి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 4,50,000 లక్షలు ఎల్‌ఓసి మంజూరీ చేయించి ఔదార్యం చూపారు. పాలకవీడు మండలం పాలకీడు గ్రామానికి చెందిన తాళ్ల పెల్లి చిన్నప్ప కుమారుడు తాళ్లపల్లి చందు హైదరాబాద్ నిజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చేతిలో ఉన్న చివరి రూపాయి వరకు ఖర్చు కాగా ప్రభుత్వ నుండి ఆర్థిక సహకారం అందించాలని తాళ్లపల్లి చందు వల్ల అమ్మ పాలకవీడు మాజీ బైరెడ్డి నాగలక్ష్మి జితేందర్ రెడ్డి. నీ ఆశ్రయించారు. దీంతో బైరెడ్డి నాగలక్ష్మి జితేందర్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వైద్య చికిత్సల నిమిత్తం రూ 4,50,000 లక్షలు మంజూరి చేయించారు. మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగలక్ష్మి జితేందర్ రెడ్డి బాధితుడు తాళ్లపల్లి చందు కు మంజూరైన రూ 4,50,000 లక్షల ఎల్ వో సి ని అందజేసి అండగా ఉం టానని ధైర్యం కోల్పోవద్దని బాధితుడికి భరోసా కల్పిం చారు. బాధితుడి కుటుంబ సభ్యులు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి, పాలకీడు మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగలక్ష్మి జితేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆకస్మికంగా సానిటేషన్ తనిఖీ నిర్వహించిన మేయర్

**జెమిని టాకీస్ వద్ద డ్రైన్ పరిశీలన**

**నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

మంగళవారం ఆకస్మికంగా సానిటేషన్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వరంగల్ జెమిని టాకీస్ ప్రాంతంలో జే సి బి ద్వారా డ్రైన్ లో కొనసాగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్ లలో చెత్త ను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వర్షపు నీరు నిలవకుండా సాఫీగా వెళ్ళిపోయే అవకాశం ఉంటుందన్నారు.

## మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆ ముగ్గురు ఇదే హవా

**నీలగిరివార్త /జులై 15/ మిర్యాలగూడ**

గ్రేట్ వన్ మున్సిపాలిటీగా పేరుందిన మిర్యాలగూడ మున్సిపాలిటీలో లోకల్..నాన్ లోకల్ మరియు కాస్ట్ ఫీలింగ్ తో సిబ్బందిపై తారతమ్యం చూపిస్తూ, ఆ ముగ్గురు తమ పై అధికారిని మచ్చిక చేసుకుని ఆజమాయిషి చేస్తూ పెత్తనం చెలాయిస్తున్నారు... క్రింది సిబ్బందినీ వారు చెప్పింది చేయాలని హుకుం జారీ చేస్తూ వినకపోతే సెక్షన్ లను మారుస్తామని బెదిరిస్తూ మరియు మారుస్తూ తనదైన శైలిలో సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు... ఆ ముగ్గురిలో ఒకరు సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తూ ప్రతి సెక్షన్ లో తలదూరుస్తూ ఇతర ఉద్యోగులకు తలనొప్పిగా ఉంటున్నాడు, మరొకరు మున్సిపాలిటీలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ అసిస్టెంట్ ని కమిషనర్ సిసిగా చెప్పుకొని అందరిని బెదిరింపులకు గురిచేస్తున్నాడు, మరొకరు సిస్టమ్ మేనేజర్, అవుట్సోర్సింగ్ గా విధులు కొనసాగిస్తూ రెగ్యులర్ ఉద్యోగులను మరియు తనకు సంబంధం లేని విషయాలలో కలగ చేసుకొని తోటి ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ఎవరైనా ఇదేమిటి అని అడిగితే కమిషనర్ గారి ఆర్డర్ అని చెప్తున్నారు. ఆ ముగ్గురు వారి పనులు వారు సక్రమంగా నిర్వహించకుండా సిబ్బంది చేసే పనుల్లో తలదురుస్తూ తలనొప్పిగా మారుతున్నారు. ఆ శాఖ అధికారికి లేనిపోని మాటలు సిబ్బంది గురించి చెబుతూ వారు చెప్పింది వేదంగా ఆ ముగ్గురు మున్సిపాలిటీ నీ గుప్పిట్లో పెట్టుకుని చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనాపటికి వారు చేసే పనులు వారి సక్రమంగా నిర్వహించకుండా సిబ్బంది పనితీరుపై విమర్శలు తెస్తూ ఇబ్బందికి గురి చేస్తున్న వారిపై అధికారి క్షుణ్ణంగా పరిశీలించి తమ పనులను నిర్వర్తించాల్సింది ఎంతైనా ఉందని స్థానికులు వాపోతున్నారు.

## ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ఉడాయించిన మదూర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

**- సిలిండర్ కోసం ఏజెన్సీ కార్యాలయం చుట్టూ వినియోగదారుల చెక్కర్లు**

**- పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**

**- పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు**




**తాండూరు / జూలై 15 :**

గ్యాస్ ఏజెన్సీలో సంవత్సరాలుగా పనిచేస్తూ తీరా గ్యాస్ ఇస్తామని నమ్మ పలికి ఖాళీ గ్యాస్ సిలిండర్లతో మరికొన్ని డబ్బులతో వినియోగదారుల నుండి తీసుకొని మద్దూర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఒకరు ఉడాయించారు. తాండూర్ పట్టణ కేంద్ర మద్దూర్ గ్యాస్ ఏజెన్సీలో సుమారు పది సంవత్సరాలుగా పనిచేస్తున్న ఒకరు వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను తెచ్చిస్తామని చెప్పి ఖాళీ గ్యాస్ సిలిండర్ తో డబ్బులతో ఉడాయించినట్లు వినియోగదారులు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాండూర్ పట్టణ కేంద్రంలో సుమారు 35 నుండి 50 మంది దగ్గర డబ్బులు గ్యాస్ సిలిండర్ తీసుకొని వెళ్ళిపోయినట్లు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీ సిబ్బంది తమ గ్యాస్ బుక్ గ్యాస్ సిలిండర్ తీసుకొని వెళ్ళాడని మద్దూర్ గ్యాస్ ఏజెన్సీకి తెలియజేస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లతో డబ్బులతో ఉడయించిన వారిపై పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని వినియోగదారులు అంటున్నారు. గ్యాస్ సిలిండర్ తీసుకపోవడంతో రోజు ఇబ్బందులకు గురవుతున్నామని వినియోగదారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ సిబ్బంది మా గ్యాస్ సిలిండర్ తీసుకెళ్లాడని తమకు కొత్త సిలిండర్ ఇవ్వాలని అడుగుతున్న ఏజెన్సీ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని వినియోగదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి మద్దూరు గ్యాస్ లో పనిచేయడంతోనే నమ్మి సిలిండర్ డబ్బులు ఇచ్చామని వినియోగదారులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్దూర్ గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకొని వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు అందేలా చూడాలని పలువురు వేడుకుంటున్నారు.

డబ్బులు, ఖాళీ గ్యాస్ సిలిండర్ ఇచ్చాం మళ్లీ ఇవ్వలేదు

హైమద్ పటేల్ తాండూరు పట్టణం

ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోతే మద్దూర్ గ్యాస్ ఏజెన్సీ వారికి డబ్బులు కూడా 950 రూపాయలు ఇవ్వడం జరిగింది. అప్పటినుండి గ్యాస్ సిలిండర్ రాలేదు. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి అడుగుతే వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకుని వినియోగదారులకు న్యాయం చేసేలా చూడాలి.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ చైర్మన్ కోదండరామిరెడ్డిని కలిసిన వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

మంగళవారం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అగ్రికల్చర్ రైతు సంక్షేమ శాఖ కోదండరామిరెడ్డి ని మాజీ శాసనసభ్యులు సంజీవరావును రాజనాల శ్రీహరి మర్యాదపూర్వ కలిశారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వేరో మండల అధ్యక్ష ,కార్యదర్శులుగా ఏకగ్రీవ ఎన్నిక

**తిరుమలయపాలెం/జూలై 15/ నీలగిరి వార్త:**





జ్ఞాన యోధులు స్వేరో వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ రిటైర్డ్ అడిషనల్ డీజీపీ ఆదేశాల మేరకు మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో స్వేరో పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు కోండ్రు రామచంద్రు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులుగా పోలే పొంగు వెంకన్న, నకరేకంటి నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు చిప్పరపల్లి వెంకటేశ్వర్లు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసీ మెంబర్స్ మేఘన , రమ్య నరేందర్ సలీం రమేష్ నాగరాజును నియమించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల స్వేరోలు పాల్గొన్నారు.

## వేములవాడలో ప్రభుత్వ కక్ష సాధింపు పాలన..

**చల్మెడ లక్ష్మీనరసింహారావు తీవ్ర స్థాయిలో విమర్శలు**

**ప్రజల కన్నీళ్లు గుర్తించని పాలన.. ఎప్పటికీ నిలబడదని వ్యాఖ్య**

**తిప్పాపూర్‌లో గజానికి రూ.8500 పరిహారమేనా?**





**నీలాగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ, మూలవాగు రెండవ వంతెన నిర్మాణాల్లో భాగంగా జరుగుతున్న కూల్చివేతలు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ప్రభుత్వ తీరులో కక్ష సాధింపు స్పష్టంగా కనిపిస్తోందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన అధికారం ఉంది కదా అని ప్రజలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, ప్రజలు కర్రు కాల్చి వాత తప్పనిసరిగా పెడతారు," అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**నోటీసులు లేకుండానే కూల్చివేతలు**

గత నెల 16వ తేదీన అనూహ్యంగా అధికారులు ప్రజలకు కనీసంగా గంట సమయమూ ఇవ్వకుండా రహదారిలోని నివాసాలు, దుకాణాలను కూల్చివేసిన ఘటనను గుర్తు చేశారు. నిర్వాసితులు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసేందుకు ప్రయత్నించినా, ఒక్కరోజు సమయం ఇవ్వకుండానే కూల్చివేతలు జరిపారని ఆరోపించారు.

**పరిహారం లేదు - సమయమూ లేదు**

పరిహారం అందించకుండా, ప్రణాళికలే ప్రకటించకుండా, అర్ధరాత్రి జెసిబిలు తీసుకొచ్చి ఇంట్లు కూల్చడం ప్రజాస్వామ్యానికి మచ్చలుగా నిలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది ప్రజాపాలన కాదు, రాజరిక పాలన," అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తిప్పాపూర్‌లో గజానికి రూ.8500 పరిహారమేనా ?**

తిప్పాపూర్ రహదారి విస్తరణలో కొందరికి గజానికి రూ.8500 పరిహారం ఇచ్చే ప్రయత్నాన్ని ఆయన ప్రశ్నించారు. "ఈ పరిహారంతో ప్రజలు ఎలా జీవించగలరు? ఈ విషయం స్థానిక ఎమ్మెల్యేకు తెలీదా?" అని నిలదీశారు.

**అభివృద్ధి పేరుతో విధ్వంసం**

మూలవాగు రెండవ వంతెన నిర్మాణం పేరుతో భూసేకరణలో అధికారుల తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. "భవిష్యత్తులో వేములవాడ అభివృద్ధి దేవుడెరుగు, ప్రస్తుత పాలన కక్షసాధింపు పరిపాలన మాత్రమే," అని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా కోర్టుల్లో చూపించడానికి భవనాలు కడుతున్నామంటూ దార్శనిక నివేదికలు సమర్పించడం ప్రజలను మోసం చేయడమే. అసలు భవనం ఎక్కడ, ఎవరికి, ఎప్పుడు? దీనిపై స్పష్టత ఇవ్వకపోవడం దురుద్దేశం స్పష్టంగా తెలియజేస్తోంది అని అన్నారు ప్రజల కన్నీళ్లు గుర్తించని పాలన ఎప్పటికీ నిలబడదని ప్రజాపాలన కొనసాగించాలా లేక కక్షసాధింపు చర్యలతో ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకోవాలా అన్నది ప్రభుత్వ నిర్ణయం అంటూ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతామని చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు.

# ఎంపీ వద్దిరాజు సన్నిహితులు స్వర్గీయ ముద్దు వినోద్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు



ఖమ్మం నీలగిరి వార్త బ్యూరో జూలై 15

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సన్నిహితులు, ప్రముఖ వాస్తుశిల్పి స్వర్గీయ ముద్దు పాపన్న వినోద్ కు నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితర ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు.కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వినోద్ సోమవారం దివంగతులయ్యారు.ఆయన పార్థివదేహానికి పంజాగుట్టలోని హిందూ శ్మశాన వాటికలో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి.అంతకుముందు బంజారాహిల్స్ వెంకటరమణ కాలనీలోని నివాసం వద్ద ఉంచిన వినోద్ భౌతికకాయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, ఎంపీ రవిచంద్రతో పాటు ఆయన అన్నలు వద్దిరాజు కిషన్,వద్దిరాజు దేవేందర్, తమ్ముడు వద్దిరాజు వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అలాగే, ఎంపీ రవిచంద్ర సతీమణి విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, కుమారుడు వద్దిరాజు నాగరాజు, సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్, హరిప్రసాద్,అనిల్ కుమార్, చెరుకూరి శేషగిరిరావు,ఊసా రఘు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు స్వర్గీయ వినోద్ కు నివాళులర్పించారు.ఆ తర్వాత భౌతికకాయాన్ని ఉంచిన పాడెను స్వర్గీయ ముద్దు వినోద్ కు కడసారి వీడ్కోలు పలికారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ల పంపిణీ

**ప్రెసిడెంట్ నల్లమాద నారాయణరెడ్డి ఆర్థిక సహాయంతో క్రికెట్ కిట్ల పంపిణీ**



దేవరకొండ నీలగిరి వార్త

క్రీడలు మానసిక దారుఢ్యానికి దోహదం చేస్తాయని లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ నల్ల మాద నారాయణరెడ్డి అన్నారు. దేవరకొండ మండలంలోని ముదిగొండ ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు చక్ర తండా గ్రామ యువతకు మంగళవారం క్రికెట్ కిట్టు ను ఆయన ఆర్థిక సహాయంతో అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడాల పట్ల ఆసక్తిని కనపరిచి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని గ్రామీణ ప్రాంత యువత అన్ని రంగాలలో రాణించేందుకు లయన్స్ క్లబ్ సహకార అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లకుమారపు మల్లయ్య , కోశాధికారి కొండూరు ఆంజనేయులు, జెర్సీ వనం శ్రీనివాసులు, లయన్స్ సభ్యులు నీల బుచ్చయ్య, గోవిందు కొండయ్య, రఘురాం నాయక్ , సముద్రాల శ్రీనివాస్, చిలుకూరు కాశీనాథ్ , నల్లగాసు సత్యనారాయణ, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తరలింపు వాహనాలను మానిటరింగ్ చేయాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్.**

**ఐసిసిసి కేంద్రాన్ని క్షేత్ర స్థాయి లో సందర్శించి నిర్వహణ తీరు పై ఆరా.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

చెత్త తరలింపు వాహనాలను మానిటరింగ్ చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో గల ఐసిసిసి కేంద్రాన్ని కమిషనర్ మంగళ వారం క్షేత్ర స్థాయి లో సందర్శించి నిర్వహిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భం గా నిర్వాహకులు ఐసిసిసి పనితీరు ను వివరిస్తూ వేరియబుల్ మెసేజ్ డిస్ప్లే, పెలికాన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జి ఐ ఎస్ డేటా సెంటర్ ఇన్స్పెక్షన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఎన్విరాన్మెంటల్ సెన్సార్ సిస్టం పనితీరును వివరించారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి ఏ సి టి ఎస్, ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్ ను పోలీసు విభాగం వారు మానిటరింగ్ చేస్తారని కమిషనర్ కు వివరించారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ (ఎస్ డబ్ల్యూ ఎం)కోసం కేటాయించిన వాహనాలను ప్రత్యేకం గా ట్రాకింగ్ చేయాలని, వాహనం ట్రాన్స్ఫర్ స్టేషన్ కు గాని డంప్ యార్డ్ వెళ్లిన వాహనాలను శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలని, వాహనాలకు సంబంధించిన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అందజేయాలని, జీ డబ్ల్యు ఎం సి నుండి ట్రాకింగ్ ,మానిటరింగ్ కోసం అధికారిని కేటాయించి మానిటరింగ్ సజావుగా సాగేలా చూడాలని ఈ సందర్భం గా కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐ టి మేనేజర్ రమేష్ మాట్రిక్స్ ఆల్వి ఎటర్నల్ సొల్యూషన్స్ ప్రతినిధులు నరసింహ, నికిషా, బెంజిమెన్, శ్రీధర్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క అధికారి విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలి

**ప్రభుత్వ కార్యాలయలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**ప్రభుత్వ సిబ్బందికి తప్పనిసరిగా బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు**

**క్యాంటీన్‌లో టీ త్రాగి, డబ్బులు చెల్లించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





ఖమ్మం, నీలగిరి వార్త బ్యూరో జూలై -15:

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళ వారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మిక శాఖ, జిల్లా ఖజానా కార్యాలయం, భోజన శాల, కలెక్టరేట్ రెవెన్యూ విభాగం, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉపాధి అధికారి, టూరిజం, డిఆర్డీవో, టౌన్ ప్లానింగ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, భూ సేకరణ విభాగం, ఏడి డ్రగ్స్ కంట్రోల్, ఏడి మైన్స్, భూ సేకరణ, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాలను, రికార్డు రూములను, ఓపెన్ లాంజ్, టాయిలెట్స్, క్యాంటీన్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగుల భోజనశాల గదిలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ తనిఖీ లో భాగంగా విద్యా శాఖ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ 10వ తరగతి ఓపెన్ స్కూల్ ద్వారా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి, సంపూర్ణ అక్షరాస్యత మండలంగా ప్రకటించేలా కార్యాచరణ చేయాలని కలెక్టర్ తెలిపారు. క్యాంటీన్ పరిశీలించి వ్యాపారం ఎలా నడుస్తుంది, ఆర్థికంగా లాభాలు ఉన్నయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ లో టీ త్రాగి, కలెక్టర్ స్వయంగా డబ్బులను చెల్లించారు.ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కే. శ్రీనివాస రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు బీసీల మహాధర్నాలో ఉత్తేజిత ప్రసంగం

ఖమ్మం నీలగిరి వార్త బ్యూరో జూలై 15:

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తమకిచ్చిన హామీ మేరకు 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని ప్రభుత్వాన్ని బీసీలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం (బీసీపీఎఫ్) ఆధ్వర్యాన ఇందిరాపార్క్ వద్ద మంగళవారం "ఛలో హైదరాబాద్"పేరిట మహాధర్నా జరిగింది.రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య,మాజీ మంత్రులు గంగుల కమలాకర్,జోగు రామన్న, వీ.శ్రీనివాస్ గౌడ్,తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్,ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్,కోరుకంటి చందర్, జాజాల సురేందర్, జైపాల్ యాదవ్,ఐఏఎస్ రిటైర్డ్ అధికారి చిరంజీవులు తదితర ప్రముఖులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ మన తెలంగాణ ప్రజల ఐకమత్యాన్ని దేశానికి మరోసారి చాటి చెప్పే సమయమిది.బీసీలం ఆనాదిగా అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నాం .దేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మనం న్యాయమైన హక్కుల సాధనకు గర్జించే,పోరాడే,పాలకులపై తిరుగుబాటు చేసే సరైన సందర్భమిది.స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా కూడా కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం,చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించకపోవడం బాధాకరం .ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీ అయినప్పటికీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం విచారకరం . కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలి.





ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానాలు చేయడం కూడా జరిగింది కేసీఆర్ బీసీలు, బహుజనుల పక్షపాతి కేసీఆర్ పాలనలో బీసీలకు సముచిత గౌరవం దక్కింది .కాంగ్రెస్ పాలనలో బీసీలు అన్ని రంగాలలో అన్యాయానికి గురవుతున్నారు.

☞ మంత్రివర్గంలో 3గురు మాత్రమే బీసీలు ఉన్నారు, వారికి అప్రధానమైన శాఖలు ఇచ్చారు

☞ కులగణన తప్పుల తడకగా ఉందని గొంతెత్తి నిరసన వ్యక్తం చేసినా పాలకులు పట్టించుకోలేదు

☞ కేంద్ర ప్రభుత్వం జరిపించే జనగణన,కులగణన తర్వాత చట్టసభల్లో మహిళలతో పాటు ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయక తప్పదు

కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న ఆర్డినెన్సు వల్ల ఒరిగేదేమీ లేదు రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానించి పంపిన బిల్లు ఇప్పటికే రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది.ఇప్పుడు తిరిగి ఆర్డినెన్స్ అనడం అర్థం లేనిది.రిజర్వేషన్లకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి ఇందుకోసం అఖిల పక్షాన్ని ప్రధాని నరేంద్ర మోడీ,రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు తీసుకు పోవాలి.బీసీ బిల్లు గురించి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం,కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలి . బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడితే కేసీఆర్ మార్గదర్శనంలో బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుంది .ఈ సందర్భంగా రవిచంద్ర, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ లను బీసీ ప్రముఖులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జై బీసీ జై జై బీసీ, పోరాడుదాం పోరాడుదాం మన న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుదాం అనే నినాదాలు హోరెత్తాయి.

# లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ మిత్ర నూతన ప్రమాణస్వీకారం

**2025 26 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ మిత్ర**

**సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**ఈ ప్రాంతానికి లయన్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివి**

**ప్రెసిడెంట్ ఇడం రాములు , ప్రధాన కార్యదర్శి మాకం చంద్రమౌళి ,కోశాధికారి చిలుకూరు వెంకటేశ్వర్లు**






దేవరకొండ నీలగిరి వార్త

సమాజానికి లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయడానికి లయన్స్ క్లబ్‌లో చేరి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలు చిరకాలం గుర్తుంచుకునే విధంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలని ఎంజెఎఫ్ లయన్ మోహన్ రావు తీగల అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం స్థానిక పి పి ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఎంజెఎఫ్ లయన్ సతీష్ కుమార్ కోడె, ఎం జె ఎఫ్ మురళీధర్ రెడ్డి తుమ్మలూరి, ఎం జె ఎఫ్ గాజుల రాజేష్, జోనల్ చైర్మన్ వనం శ్రీనివాసులు, లయన్ అశోక్ రెడ్డి గట్టుపల్లి, రేణుక కొండపల్లి లు మాట్లాడుతూ దేవరకొండ జోన్లోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్నదని వేలాదిగా కంటి ఆపరేషన్లు చేసిన ఘనత లయన్స్ క్లబ్బులకే దక్కిందని తెలిపారు. గత సంవత్సరం 12 మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడం సామాన్య విషయం కాదని తెలిపారు .జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రెసిడెంట్ ఇడం రాములు, ప్రధాన కార్యదర్శిమాకం చంద్రమౌళి, కోశాధికారి చిలుకూరి వెంకటేశ్వర్లు, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పిఎస్టిలో మాట్లాడుతూ విద్యా ఆరోగ్య సామాజిక కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్ కూరేళ్ల కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి మాకం మహేష్, కోశాధికారి నామ దామోదర్, పగిడిమర్రి రఘురాములు ,చేరుపెల్లి జయలక్ష్మి ,చేపూరి భీష్మాచారి, పగిడిమర్రి రాధా రాణి, లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ, సముద్రాల ప్రభాకర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నల్ల మాద నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లకుమారపు మల్లయ్య, డాక్టర్ పి .జె సామ్సన్ , చీదెళ్ళ వెంకటేశ్వర్లు, మాదిరెడ్డి సంధ్యారెడ్డి, పగిడిమర్రి రాధా రాణి , శిరందాసు కృష్ణయ్య, నీల బుచ్చయ్య, నారాయణ సింగ్, చేపూరి మధు, చేరుపల్లి ఎల్లయ్య, శ్రీరామోజు శ్రీనివాస చారి, తదితరులు పాల్గొన్నారు.

# నియామక పత్రం అందజేత



నాంపల్లి నీలగిరి వార్త జూలై 15:

మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన బిసి సంఘం యూత్ మండల అధ్యక్షుడిగా నాంపల్లి సతీష్ ను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఎన్నిక నియమాక పత్రాన్ని అందుకున్నారు.

# బోనాల పండగకు విస్తృత ఏర్పాటు చేయండి

**నగర మేయర్ గుండు సుధారాణి**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

నగరవ్యాప్తంగా జరగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల పండుగకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు మంగళవారం ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో ఇంజనీరింగ్, విభాగ ఆధికారులతో త్వరలో జరుగనున్న శ్రావణ మాస పోచమ్మ బోనాల నేపద్యం లో చేయాల్సిన ఏర్పాట్ల పై జరిగిన సమావేశం లో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల నేపథ్యంలో అమ్మ వారిని దర్శించుకునెందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని అన్ని ఆలయాలకు లైటింగ్ ఏర్పాట్ల తో పాటు అంతర్గత రహదారులకు డస్టింగ్ వేయాలన్నారు.ఈ సందర్భంగా మేయర్ బల్దియాలోని 66 డివిజన్లలో పలు పథకాల క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులపై డివిజన్లవారిగా. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి సకాలంలో పూర్తి చేయాలని, టెండర్ ప్రక్రియలోబన్న పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎస్ ఈ మహేందర్, ఈ ఈ లు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత తో పాటు డిఈలు ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా సిత్ల పండగ

**ప్రకృతి కనికరించాలని ప్రజల ఆరోగ్యాలు బాగుండాలని పూజలు**





దేవరకొండ నీలగిరి వార్త

గిరిజన సంస్కృతి సాంప్రదాయాల్లో ఆనవాయితీగా వస్తున్న సిత్ల పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజలు మంగళ హారతులు అనంతరం స్వామివారికి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు కేతావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో నిర్వహించే సాంప్రదాయ పండుగ అని తెలిపారు . పశువులు రోగాల బారిన పడకుండా ,పంటలు పండాలని , చిన్నపిల్లలు, ప్రజలు రోగాలను బారిన పడకుండా , వర్షాలు సమృద్ధిగా కురవడానికి ప్రతి రూపమే ఈ సిత్ల పండగని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే. శంకర్ నాయక్, దేవరకొండ మండల అధ్యక్షుడు కే. పాండు నాయక్, నేరడు గోమ్ము అధ్యక్షులు వి. పాపా నాయక్, చందంపేట అధ్యక్షుడు ఆర్ .పాండు నాయక్, కొండమల్లేపల్లి అధ్యక్షుడు ఆర్ .లాలు నాయక్, పీఏ పల్లి అధ్యక్షుడు ఆర్ .బోడియ నాయక్, డిండి అధ్యక్షుడు ఎం. రేఖ నాయక్, చింతపల్లి అధ్యక్షుడు కొండా నాయక్, ఆర్ గోపాల్ సింగ్ ,ఆర్ ధరమ్ సింగ్, గౌరవ అధ్యక్షులు కె. చందర్ నాయక్, దేవరకొండ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్ . కోట్య నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్. నాగేశ్వరరావు నాయక్, ఆర్ .నారాయణ నాయక్, పుల్యా నాయక్, ఈ .సౌమ్య నాయక్, మీసేవ రమేష్ , లక్పతి నాయక్, దశరథ్ నాయక్, ఎన్ . లచ్చిరామ్ నాయక్, తుల్జా నాయక్, బిక్షపతి, ధర్మానాయక్, జయప్రకాష్ ,దీప్లా నాయక్, ఠాకూర్ నాయక్, ఆర్ లక్ష్మణ్ నాయక్ , నిరంజన్ నాయక్,పూజారి పాండు, పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయండి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణా పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్ లోని పాత ఆజంజాహి మిల్స్ గ్రౌండ్లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను సందర్శించి పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయాల సముదాయాలలో మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండవ అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున ఫినిషింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన సిబ్బందిని వనరులను వియోగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాంపౌండ్ వాల్, పైప్ లైన్ తదితర నిర్మాణ పనులను కూడా ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా రోడ్ల భవన అధికారి రాజేందర్, డి ఈ శ్రీధర్ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు చర్యలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో కలెక్టర్ సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కట్టెల పొయ్యితో కాకుండా గ్యాస్ ద్వారా వంట చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న సుమారు 500 ప్రభుత్వ పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అందుకు ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రతి మండలానికి సుమారు 35 నుండి 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నందున ఆయా మండల ఎల్పిజి ఏజెన్సీల నుండి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసేలా చూడాలని ఎల్పిజి ఏజెన్సీ ప్రతినిధులను కోరారు. వైద్య ఆరోగ్యశాఖఆధ్వర్యంలో ఆర్ బి ఎస్ కె ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కేజీబివిలలో విద్యార్థులకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయుటకు సంబంధిత విద్యాసంస్థల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు మండల విద్యాశాఖ అధికారులు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో తదితరులు పాల్గొన్నారు .

# ఉద్యమాల నిర్మాణమే దోపిడి నివారణకు మార్గం

**పాలకుల విధానాలతో పెరుగుతున్న అసమానతలు.**

**ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

పాలకుల విధానాలతో ప్రజల మధ్యన అసమానతలు పెరిగి దోపిడీకి గురవుతున్నారని అందుకు ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఏకైక పరిష్కారమని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. ఈరోజు కామ్రేడ్ మాలోత్ సాగర్, కామ్రేడ్ ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి కుటుంబాల కార్యకర్తలు ప్రజలు ఎంసిపిఐ(యు) పార్టీలో జాతీయ రాష్ట్ర జిల్లా కార్యదర్శులు మద్ది కాయల అశోక్ ఓంకార్ గాదగోని రవి పెద్దారపు రమేష్ ల సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన శంభునిపేటలోని ఆర్ఆర్ గార్డెన్లో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్ది కాయల అశోక్ ఓంకార్ ప్రసంగిస్తూ కమ్యూనిస్టులను, ప్రజా ఉద్యమాలను బలహీనపర్చాలని పాలకులు అన్ని విధాల కుట్రలు చేస్తున్నారని నిర్బంధాలను ప్రయోగించి కుట్ర కేసులు పెడుతున్నారని అయినా సమాజంలో దోపిడి ఉన్నంతకాలం ఎర్రజెండా ఉద్యమాలు ఉంటాయని ఎంత అణగదొక్కితే అంతకు రెట్టింపు స్థితిలో బలపడతాయని అయితే దోపిడి వర్గాలకు ఉన్న ఐక్యత కమ్యూనిస్టుల మధ్యన లేకపోవడం పాలకులకు ఒక వరంగా మారింది అన్నారు. సమాజంలోని సంపద అందరికీ సమానంగా దక్కేలా శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా కమ్యూనిస్టులు సామాజిక తరగతులు ప్రజా సంఘాలు ఐక్యంగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తే తప్ప ప్రత్యామ్నాయంగా లభించదని ఈ క్రమంలో ఎంసిపిఐ(యు) కమ్యూనిస్టులు ఐక్యతకు శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నదని కార్యకర్తల్లో బలహీనతలను లోటుపాట్లను సరిచేసి సరైన దృక్పథంతో ముందుకు సాగుతుందని తెలిపారు. పార్టీలో చేరిన ముఖ్య నాయకులు మాలోత్ ప్రత్యూష గణిపాక ఓదేలు మహమ్మద్ అబ్బు తాటికాయల రత్నం సింగారపు దాసు మాధవి మీరు నిసా రామస్వామి రమేష్ లక్ష్మణ్ ఆశా బేగం అనిల్ సుభాష్ కుమార్ కోటేశ్వర్ యాకయ్య బాబు రాజు రఘుపతి స్వప్న కళ లావణ్య రేణుక ముంతాజ్ ఉమాదేవి తదితరులతోపాటు వెయ్యి మంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జిల్లా నాయకత్వం వల్లపు ఉపేందర్ రెడ్డి గోనె కుమారస్వామి ఎన్ రెడ్డి హంసారెడ్డి మంద రవి నర్ర ప్రతాప్ కన్నం వెంకన్న వంగల రాగసుద కనకం సంధ్య మాస్ సావిత్రి గడ్డం నాగార్జున కర్ర రాజిరెడ్డి సుంచు జగదీశ్వర్ నాగెల్లి కొమురయ్య కొత్తకొండ రాజమౌళి మహమ్మద్ ఇస్మాయిల్ లతోపాటు జిల్లా కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.




# శ్వేతార్కుడికి విశేషంగా విభూతి అభిషేకము

**ఘనంగా దమనార్చన.. భారీ సంఖ్యలో భక్తులు**





వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం స్వయంభు శ్రీ శ్వేతార్కముల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో సంకష్టహర చవితినీ పురస్కరించుకొని దేవాలయంలో విశేషంగా ఉదయం నుండి భక్తుల సందడి నెలకొంది ఈ నేపథ్యంలో ప్రతి సంకష్ట చవితి వలె సాయంత్రం స్వామివారికి ఘనంగా విభూదితో అభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దేవీ ఉపాసకులు, గంగు సత్యం పంతులు శర్మ హైదరాబాద్ వాస్తవ్యులు పాల్గొన్నారు దేవి పారాయణం ఉపాసకులు కక్కర్ల ధరిత్రి పాల్గొనడం జరిగింది అభిషేక అనంతరం భక్తులచే సేకరించబడిన ధమనాలు తో దేవాలయ ప్రదక్షిణ గావించి శ్వేతార్క సహస్రనామార్చనని నిర్వహించడం జరిగింది. అనంతరం స్వామివారికి రక రకాల కాయగూరలతో కదంబ ప్రసాదాన్ని తయారుచేసి నివేదనని సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి శ్వేతార్క గణపతి అనుగ్రహాన్ని పొందారు, బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ శర్మ బ్రహ్మశ్రీ అయినవోలు సాయి కృష్ణ శర్మ, బ్రహ్మశ్రీ శరత్ శర్మ మంత్రోచ్చారణ చేయగా అర్చకులు హరికృష్ణ స్వామి శివం దువేది రోహిత్ ఉపాధ్యాయ అభిషేకం నిర్వహించారూ అభిషేకం అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను దేవులపల్లి సదనందం ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు అనంతరం భక్తులందరికీ సంకష్టహర చవితి కథ శ్రవణము భక్తులందరికీ వేద ఆశీర్వచనము తీర్థ ప్రసాద వితరణ అభిషేకం చేసిన విభూదిని వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు గంట సీనమ్మ నేరెళ్ల రాధా ఉమాదేవి లక్ష్మీ కల్పన సునీత అరుణ వెంకట నరసమ్మ అనురాధ నాగమణి హేమలత వెంకట సాయి తేజ స్వరూప్చంద్ పాక పవన్ కుమార్ పాక సాత్విక్ బుర్ర సాయిరాం తుమ్మ శ్రీనివాస్ అమర్నాథ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు అన్నపూర్ణ భవన్ లో అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది లక్క రవి దుర్గం సుదీర్ మనీ శ్రీనివాసరావు పద్మ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**

**కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంజెపి పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్.**



హనుమకొండ నీలగిరి వార్త.

హనుమకొండ విద్యార్థులను చదువుతోపాటు క్రీడలు, ఆసక్తి ఉన్న ఇతర రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.

మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలోని పలు తరగతుల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ సంభాషించారు. విద్యార్థుల అభ్యసన విధానం, పాఠశాల విద్యావిషయాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు యూనిఫామ్, బెల్టులు, టైలు, బ్యాగులు అందరికీ అందాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారా అని విద్యార్థులను కలెక్టర్ అడిగారు. ఐదో తరగతిలో చేరిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల వాతావరణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనం, ఆహార పదార్థాలు బాగుంటున్నాయా అని, పాఠశాల టైం టేబుల్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ సదుపాయాలు, బోధనా విధానాల గురించి కూడా వివరంగా తెలుసుకున్నారు. సంగీతానికి సంబంధించి పాఠశాలలో ఉన్న ఇన్స్ట్రుమెంట్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, ఆర్.ఓ ప్లాంట్, పాఠశాల పరిసరాల్లోని పరిశుభ్రతను పరిశీలించారు. కూరగాయలు ఎన్ని రోజులకు ఒకసారి తీసుకువస్తారని, రైస్ ఇండెంట్ ఎలా చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మెనూను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న సైన్స్ ల్యాబ్ ను పరిశీలించి ల్యాబ్ లోని పరికరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఆహార పదార్థాలను అందించాలన్నారు. పాఠశాలలో ఎల్లప్పుడూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈసందర్భంగా పాఠశాలలోపరిశుభ్రత, విద్యార్థుల అభ్యసన ప్రగతి, విద్యార్థుల ఆసక్తి అభిరుచిని గు రించి కలెక్టర్ ప్రశంసించారు. పాఠశాలను సందర్శించిన సందర్భంగా ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మొక్కను నాటినీళ్ళు పోశారు. జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంజెపి వరంగల్ ఆర్సీవో రాజ్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ తాడూరి రవీందర్, స్థానిక తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్స్ సమస్యలపై కలెక్టర్ కు ఐద్వా వినతి



- జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్స్ 75 నుంచి 150 కి పెంచాలి
- 6 పడకల దవాఖానలను 50 బెడ్స్ కు విస్తరించాలి
- ఆసుపత్రుల్లో సరిపడా డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్

ఖమ్మం నీలగిరి వార్త బ్యూరో జూలై 15

ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఖమ్మం జిల్లా కమిటీ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి కలెక్టరేట్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సమస్యలపై ఓ సర్వే నిర్వహించినట్లు తెలిపింది. దీనిలో భాగంగా 12 పి.హెచ్.సి.లు, 4 సబ్ సెంటర్స్, 2 ఏరియా హాస్పిటల్స్ ను ప్రత్యక్షంగా సందర్శించామని..ఆయా ఆసుపత్రిల్లోని సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో బెడ్స్ కొరత చాలా తీవ్రంగా ఉన్నదని, 150 పడకలు అవసరం ఉండగా ప్రస్తుతం 75 మాత్రమే ఉన్నాయని తెలిపింది. సరిపడా లేకపోవడంతో ఒక్కో బెడ్ పై ఇద్దరు చొప్పున పేషెంట్లు పడుకుంటున్న దుస్థితి ఉందని పేర్కొంది. కొన్ని సందర్భాల్లో బెడ్స్ సరిపోకపోవడంతో కింద కూడా పడుకుంటున్నారని తెలిపింది. జిల్లా ఆసుపత్రిలో లాపరోస్కోపి సెంటర్ లేదు, ఒక్కరే పర్మినెంట్ డాక్టర్ ఉన్నారని, తక్షణమే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి కోరింది. శానిటరీ సిబ్బంది కూడా లేకపోవడం వలన ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపింది. సర్వే చేసిన అన్ని సెంటర్స్ లో సరిపడా డాక్టర్స్ లేరని, వైద్య పరికరాలు లేవని, మంచినీటి సౌకర్యం, బాత్రూమ్స్ లేవని తక్షణమే పర్మనెంట్ డాక్టర్స్, ఇతర వైద్య సిబ్బందితో పాటు అన్ని సెంటర్స్ 6 పడకల ఆసుపత్రులుగానే ఉన్నాయని.. తక్షణమే వీటిని 50 పడకలకు పెంచాలని కోరింది.

నేలకొండపల్లి, వైరా రూరల్, పాలడుగులో ఆసుపత్రి బిల్డింగులు శిథిలావస్తలో ఉన్నాయని, మేడేపల్లి, వెంకటాపురం, ముదిగొండ, వల్లభిలలో అద్దె భవనాలలో ఆసుపత్రులు నడుస్తున్నాయని, అన్ని ఆసుపత్రులకు సొంత భవనాలు నిర్మించాలని, మధిర సబ్ సెంటర్ ఆసుపత్రికి ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, విష కీటకాలు చేరుతున్నాయని.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. కారేపల్లి, తల్లాడ మండలాల జనాభా 50 నుండి 60 వేల వరకు ఉందని, ఇక్కడ కేవలం ఒక్కో పి.హెచ్.సి. మాత్రమే ఉన్నాయని, వీటిని 2 పి.హెచ్.సి.లకు పెంచాలని కోరింది. జనాభా ప్రాతిపదికన అన్ని మండలాల్లో పి.హెచ్.సి.లు ఏర్పాటు చేయాలని, ఖమ్మం టౌన్ రిక్కాబజార్ బస్తీ దవాఖానలో ఎటువంటి సౌకర్యాలు లేవని, వైద్యులు ఏ సమయంలో ఉంటారో ఎటువంటి సమాచారం ఉండటం లేదని, హవేలీ మండల సబ్ సెంటర్లో 15 ఏళ్లుగా కరెంటు లేకపోవడంతో పేషెంట్స్, డాక్టర్స్, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూర్చోవడానికి బల్లలు కూడా లేని దుస్థితి ఉందని ఐద్వా పేర్కొంది. ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించిన వారిలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు మెహరున్నీసాబేగం, జిల్లా కమిటీ సభ్యులు బాగం అజిత తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ గారి క్యాంప్ కార్యాలయంలో 7 మంది లబ్ధి దారులకు 6లక్షల 20 వేల రూపాయల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుకు ఎంపీ డా. కడియం కావ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహా య నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. పేదల కోసం నిరంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పని చేస్తున్నారని తెలిపారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఇంటెలిజెన్స్ డి ఐ జి సన్నీ దంపతులు



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

మంగళవారం ఉదయం ఇంటెలిజెన్స్ డీఐజీ సన్నీ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు వీరి వెంట ఇంటలిజెన్స్ డి.ఎస్.పి కృష్ణ ప్రసాద్ ఎస్ఐ రవికుమార్ తదితరులు ఉన్నారు పూజ అనంతరం మహదాశీర్వచరణం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహుకరించి ఈవో శేషుభారతి ప్రసాదములు అందజేశారు.

# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన ద్విచక్ర వాహన దారులకు జరిమానా విధించిన వరంగల్ ట్రాఫిక్ పోలీసులు

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 02 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం 2000/- రూపాయలు జరిమాన విధించినారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 34 మందికి 42,100/-రూపాయల జరిమాన విధించినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ కె, రామకృష్ణ తెలిపారు.

# శ్రీ దుర్గాదేవి శాఖంబారి ఉత్సవాల్లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రవచనాలు



నర్సంపేట నీలగిరి వార్త.

మంగళవారం స్థానిక సర్వాపురం, నర్సంపేట మండలంలోని శ్రీ సంతోషి మాతా ఆలయంలో దుర్గాదేవి శాఖంభరీ ఉత్సవాల్లో భాగంగా దేవి ఉపాసకులు గట్టు. నారాయణచార్యులు ప్రధాన అర్చకులు వికాస తరంగిణి బాధ్యుల మధ్య ప్రవచనం వినిపించారు దుర్గా మాత మహిమలు కోరికలు భక్తల భక్తితో మహిళలు ఇంటిల్లిపాధి సౌబాగ్యం కోసం పూజలతో కోలవాలని. దుర్గా దేవి చరిత్ర అవతారాలు 18 అధ్యాయాలు తొ వివరించారు దుర్గా దేవి ఒక హిందూదేవత, ఆమెమహాదేవిరూపంగాపరిగణిం చబడుతుంది. ముఖ్యంగా కరువు కాలంలో ప్రజలకు ఆహారం అం దించడానికి ఆమె శాకంబరిగా అవతరించింది. దేవీ భాగవతం, మార్కండేయ పురాణం వంటి గ్రంథాలలో ఆమె గురించి ప్రస్తావన ఉంది.

శాకంబరి దేవి కథ

పూర్వం, దుర్గమాసురుడు అనే రాక్షసుడు వేదాలను అపహరించి, తద్వారా లోకంలో కరువును సృష్టించాడు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది అప్పుడు, ఋషులు, మునులు కలిసి శాకంబరి దేవిని ప్రార్థించారు. వారి ప్రార్థనలకు కరుణించిన దేవి, తన నూటొక్క కన్నులతో లోకాలన్నింటినీ చూస్తూ, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో నిండిన రూపంతో అవతరించింది.

అందుకే, శాకంబరి దేవిని ఆహారం, పోషణకు దేవతగా భావిస్తారు. అనంతరం తీర్థ ఘోస్టి తొ కార్యక్రమం సుసంపన్నం ఐనది. కార్యక్రమం వికాస తరంగిణి అధ్యక్షులు ఎంవీ. కృష్ణారావు కార్యదర్శి రంగనాథ స్వామి కోశాదికారి ఎం.రేణుక, కోట. శ్రీనివాస్ పెద్ది సాంబశివుడు కొట. కల్పన, సంధ్య, అన్నపూర్ణ, హైమ, ఇమ్మడి పద్మ భక్తులు పాల్గొన్నారు.